E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 20-08-2025 (వారం) బుధవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




ఎన్నికల వ్యవస్థ బలోపేతానికి.. ఆర్నెళ్లలో 28 రకాల చర్యలు: ఈసీ » 2లో

## వ్యవసాయ కుటుంబంలో జన్మించి.. ఉప రాష్ట్రపతి అభ్యర్థి స్థాయికి

- ఇండియా కూటమి అభ్యర్థిగా ఎంపిక
- ఈ ఎన్నిక 'సైద్ధాంతిక యుద్ధం' అంటూ అభివర్ణన
- ప్రజాస్వామ్యం సాధించిన గొప్ప విజయమని వ్యాఖ్య
- ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో పోటీ పడనున్న సుప్రీం మాజీ జస్టిస్
- నేడు నామినేషన్లు దాఖలు చేయనున్న అభ్యర్థులు... సెప్టెంబర్ 9న ఎన్నికలు
- వ్యవసాయ కుటుంబంలో జన్మించి న్యాయ కోవిదుడిగా ఎదిగిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి
- రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం తాలూకా ఆకుల మైలారం ఆయన స్వగ్రామం

తరువాయి 2లో



## రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొందాం

- విపక్షాలకు విజ్ఞప్తి చేసిన ప్రధాని మోదీ

తరువాయి 2లో



## భారత్‌కు అరుదైన ఖనిజాలు, ఎరువులు సరఫరా చేసేందుకు చైనా అంగీకారం

- టన్నెల్ నిర్మాణ యంత్రాలు కూడా..
- సరఫరా చేసేందుకు చైనా ఓకే
- ప్రధాని మోదీ, అజిత్ దోవల్‌తో చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ భేటీ
- ఈ నెల 31న చైనా వెళ్లనున్న మోదీ



బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కీలకమైన అరుదైన ఖనిజాలను, కీలకమైన ఎరువులను భారత్‌కు సరఫరా చేసేందుకు చైనా ముందుకొచ్చింది..

తరువాయి 2లో

## రూ.399కే 'చాట్‌జీపీటీ గో'.. ఫీచర్లు ఇవే

» 4లో



## 'థగ్ లైఫ్ డిజాస్టర్.. మీరనుకునే వ్యక్తి కాదన్న శృతిహాసన్'

» 5లో



# తెలుగువాడిని గెలిపించుకుందాం!

తరువాయి 2లో

- రెండు రాష్ట్రాల 60 ఓట్లు ఆయనకే పడాలి
- పార్టీలు వేరైనా నాడు పీవీ విషయంలో ఎన్టీఆర్ చూపిన చొరవను స్ఫూర్తిగా తీసుకోవాలి
- సుదర్శన్‌రెడ్డి గెలిస్తే ప్రజాస్వామ్యం సురక్షితం
- రాష్ట్రంలో కులగణన సర్వే అధ్యయనానికి నిపుణుల కమిటీ చైర్మన్‌గా సేవలందించారు
- పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే సుదర్శన్‌రెడ్డికి మద్దతు కోసం కేసీఆర్‌ను కలుస్తా
- ఆయన నా ముఖం చూస్తాడో.. లేదో..?
- సుప్రీం తేల్చుకుంటే పార్టీ పరంగా రిజర్వేషన్లు
- మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రకటించడం తెలుగువారికి దక్కిన గౌరవమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.**

ఈకబురు: ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రకటించడం తెలుగువారికి దక్కిన గౌరవమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 42 మంది లోక్‌సభ, 18 మంది రాజ్యసభ సభ్యులంతా ఏకతాటిపైకి వచ్చి ఆయన్ను గెలిపించాలని కోరారు. సుదర్శన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ సహా ఏ పార్టీతోనూ సంబంధం, అనుబంధం లేదని ప్రస్తావించారు. ఆయనకు ఏ పార్టీలోనూ సభ్యత్వమూ లేదని గుర్తు చేశారు. తెలుగు భాషను ప్రాచీన భాషగా గుర్తించేందుకు అందరమూ ఒకటైనట్లుగానే తెలుగువాడైన సుదర్శన్‌రెడ్డిని గెలిపించడానికి పార్టీలకు అతీతంగా అందరూ ఒక్కటి కావాలని పిలుపునిచ్చారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి విజయం కోసం కృషి చేయాలంటూ టీడీపీ, బీఆర్ఎస్, వైసీపీ, ఎంఐఎం, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబు, కేసీఆర్, వైఎస్ జగన్, అసదుద్దీన్ ఒవైసీ, పవన్ కళ్యాణ్‌లకు విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల్లో సుదర్శన్‌రెడ్డికి మద్దతు కూడగట్టాలని వామపక్ష నేతలను కోరారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి మాట్లాడారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రకటించడం తెలుగు ప్రజల గౌరవ ప్రతిష్ఠలను పెంచిందని చెప్పారు. దేశ రాజకీయాల్లో.. ఎన్నికల్లో నెగ్గడానికి ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగ పరిచి ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం చేస్తున్న ఎన్డీయే ఒక పక్కన ఉంటే..

## బిహార్లో ఒక్క ఓటూ తస్కరించనివ్వం

### ఓట్ల చోరీలో ఈసీ-బీజేపీ భాగస్వామ్యం

### 'ఓటర్ అధికార యాత్ర'లో రాహుల్



ఈ-కబురు: ఓట్ల దొంగతనంలో ఎన్నికల కమిషన్ (ఈసీ), బీజేపీ భాగస్వాములని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపించారు. ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) ద్వారా బిహార్లో ఒక్క ఓటును కూడా తస్కరించనివ్వబోమని స్పష్టంచేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత రాహులే ప్రధానమంత్రి అవుతారని ఆర్‌జేడీ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ అన్నారు. 'ఓటర్ అధికార యాత్ర'లో మూడోరోజు మంగళవారం వారు నవాడాలో జరిగిన ర్యాలీలో ప్రసంగించారు. 'ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఎన్నికల కమిషనర్లు ఓటు హక్కును ప్రజల నుంచి లాక్కుంటున్నారు. హరియాణా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ఎన్నికలను ఇలాగే దొంగిలించారు. » 2లో

## జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయండి



ఈకబురు: హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను రద్దు చేయాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావులు హైకోర్టులో మంగళవారం వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలపై న్యాయ విచారణకు జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ 2024 మార్చి 14న ప్రభుత్వం జారీ చేసిన జీవో 6ను కూడా అందులో సవాలు చేశారు. ప్రతివాదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి, జస్టిస్ ఘోష్ కమిషన్‌ను పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పిటిషన్లు హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉన్నాయి. ఎలాంటి ఆధారాలు లేకుండా నాటి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాల్జేసే రాజకీయ వ్యూహంలో భాగంగా కమిషన్ నియామకం జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ నివేదిక రూపొందించిందని పిటిషన్లలో పేర్కొన్నారు. స్థూలంగా వివరాలు ఇవీ..

తరువాయి 2 లో

## ఒక్కరోజే 30 సెంటీ మీటర్ల వాన

» 2లో



## మిస్ యూనివర్స్ ఇండియాగా మాణికా విశ్వకర్మ

» 3లో



## తెలంగాణపై కేంద్రం వివక్ష

- యూరియా ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతున్న మోదీ సర్కారు
- పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీల నిరసన
- ధర్నాకు ప్రియాంకాగాంధీ మద్దతు




తరువాయి 3లో

## విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లను తీసేయండి



- కేబుల్ ఆపరేటర్ల తీరు వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు
- అనుమతుల్లేని విద్యుత్ కనెక్షన్లపై కఠిన చర్యలు: భట్టి విక్రమార్క

తరువాయి 2లో

మొదటి పేజీ తరువాయి

# తెలుగువాడిని గెలిపించుకుందాం!



సుదర్శన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ సహా ఏ పార్టీతోనూ సంబంధం, అనుబంధం లేదని ప్రస్తావించారు. ఆయనకు ఏ పార్టీలోనూ సభ్యత్వమూ లేదని గుర్తు చేశారు. తెలుగు భాషను ప్రాచీన భాషగా గుర్తించేందుకు అందరమూ ఒకటైనట్లుగానే తెలుగువాడైన సుదర్శన్‌రెడ్డిని గెలిపించడానికి పార్టీలకు అతీతంగా అందరూ ఒక్కటి కావాలని పిలుపునిచ్చారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి విజయం కోసం కృషి చేయాలంటూ టీడీపీ, బీఆర్ఎస్, వైసీపీ, ఎంఐఎం, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబు, కేసీఆర్, వైఎస్ జగన్, అసదుద్దీన్ ఒవైసీ, పవన్ కళ్యాణ్‌లకు విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల్లో సుదర్శన్‌రెడ్డికి మద్దతు కూడగట్టాలని వామపక్ష నేతలను కోరారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి మాట్లాడారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రకటించడం తెలుగు ప్రజల గౌరవ ప్రతిష్ఠలను పెంచిందని చెప్పారు. దేశ రాజకీయాల్లో.. ఎన్నికల్లో నెగ్గడానికి ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగ పరిచి ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం చేస్తున్న ఎన్డీయే ఒక పక్కన ఉంటే.. రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ, రాజ్యాంగ బద్ధమైన సంస్థలను పరిరక్షించాలని చూస్తున్న ఇండియా కూటమి మరోపక్కన ఉంద ని వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లను రద్దు చేయాలని కుట్రలు చేస్తున్న వారిని ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓడించేందుకు ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రకటించడం మనందరికీ గర్వకారణమని చెప్పారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి రాజకీయాలకు అతీతుడని, తెలంగాణ రైతు బిడ్డ, రాజ్యాంగ నిపుణుడని అన్నారు. తెలంగాణ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో జడ్జిగా, ఇతర రాష్ట్రాల్లో చీఫ్ జస్టిస్‌గా సుదీర్ఘ కాలం సేవలు అందించారని గుర్తు చేశారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఆయన్ను గెలిపించాల్సిన బాధ్యత ప్రతి తెలుగువాడిపైన ఉందని చెప్పారు.

**ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి**

రాజ్యాంగ పరిరక్షణ కోసం న్యాయ కోవిదుడైన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతి చేయాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీల నాయకత్వాలు రాజకీయాలకు అతీతంగా ఆయనకు మద్దతు ఇవ్వాలని ఇండియా కూటమి, తెలంగాణ ప్ర భుత్వం తరపున కోరుతున్నానన్నారు. తెలుగు రాష్ట్రం నుంచి పీవీ నర్సింహారావు ప్రధాని అయినప్పుడు.. నంద్యాల లోక్‌సభకు జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన్ను గెలిపించేందుకు అప్పటి ప్రధాన ప్రతిపక్ష నేత, టీడీపీ అధినేత ఎన్టీఆర్ ముందుకు వచ్చారని గుర్తు చేశారు. తెలుగువాడైన పీవీ ప్రధాని కావడం తెలుగువారందరికీ గర్వకారణమని చెప్పిన ఆయన.. ఉప ఎన్నికల్లో టీడీపీ తరఫున అభ్యర్థిని పోటీకి పెట్టలేదని చెప్పారు. సిద్ధాంతపరంగా వైరుధ్యం ఉన్నా పీవీకి సంపూర్ణ మద్దతు పలికి ఆయన గెలుపునకు సహకరించి.. రాజకీయంగా విజ్ఞత ప్రదర్శించారని గుర్తు చేశారు. ఉప రాష్ట్రపతిగా సుదర్శన్‌రెడ్డి గెలిస్తే.. రేపటి రోజున ఆయన రాష్ట్రపతి అయ్యేందుకూ అవకాశం ఉంటుందన్నారు. అందరూ ఏకమై ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా, ఆదర్శంగా తీసుకుని.. సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయ కోవిదుడైన సుదర్శన్‌రెడ్డి ఉపరాష్ట్రపతిగా ఉంటే ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉంటుందని, అంతిమంగా దేశానికి మేలు జరుగుతుందని చెప్పారు.

**బీసీలకు 42% రిజర్వేషన్ వస్తుంది**

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో సుదర్శన్‌రెడ్డి గెలిస్తే విద్య, ఉద్యోగాలు, ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్డీయే అభ్యర్థి రాధాకృష్ణన్.. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలని చూస్తున్న, విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను అడ్డుకుంటున్న ప్రధాని మోదీకి ప్రతినిధి అని చెప్పారు. ఎన్డీయే అభ్య ర్థి గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేసే ప్రక్రియ వేగంగా అమలవుతుందన్నారు. ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి బలహీన వర్గాల బలమైన గొంతుకన్నారు. రాష్ట్రంలో కులగణన సర్వే నిర్వహించిన తర్వాత ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల కమిటీకి సుదర్శన్‌రెడ్డి చైర్మన్‌గా వ్యవహరించారని గుర్తు చేశారు. చైర్మన్‌గా ఆయన సూచన మేరకే విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాధాకృష్ణ గెలిస్తే ఓబీసీలకు అన్యాయం జరుగుతుందని, సుదర్శన్‌రెడ్డి గెలిస్తే 42% రిజర్వేషన్ వస్తుందని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశంలోని అంద రూ ఆత్మప్రభోధానుసారం ఓటేయాలని సూచన చేశా రు. ఈనెల 21న సుదర్శన్‌రెడ్డి నామినేషన్ ప్రక్రియ పూర్తవుతుంద చెప్పారు. రాష్ట్రంలోని రైతుల అవసరాల మేరకు యూ రియాను సరఫరా చేయాలంటూ లేఖలు, విజ్ఞప్తుల రూపం లో కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం పదే పదే కోరినా స్పందన లేకపోవడం దారుణమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అయితే రైతులకోసం మోదీ సర్కారుపై ఒత్తిడి తెచ్చేందుకు తమతో కలిసి రావాల్సిన బీఆర్ఎస్ ఎంపీలు.. పార్లమెంటులో పత్తా లేరన్నారు. గల్లీలో లొల్లి చేసేందుకు ఉత్సాహం చూపేవాళ్లు.. ఢిల్లీలో మోదీని ప్రశ్నించేందుకు ఎందుకు భయపడుతున్నారంటూ నిలదీశారు. రాష్ట్ర రైతాంగానికి అండగా నిలవాల్సిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు మోదీ భజనలో బిజీగా ఉన్నారని ధ్వజమెత్తారు. నిర్లక్ష్య, వివక్ష పూరిత వైఖరిని ప్రదర్శిస్తోన్న కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఎండగట్టిన, పార్లమెంటు వేదికగా తెలంగాణ రైతుల పక్షాన నిలిచిన ప్రియాంకగాంధీకి ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని పేర్కొన్నారు. సుప్రీం నిర్ణయం ఆలస్యమైతే పార్టీ పరంగా రిజర్వేషన్లు ప్రభుత్వ బిల్లులపై గవర్నర్/రాష్ట్రపతి 90 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు గడువు పెట్టిన నేపథ్యంలో.. కోర్టు తుది నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు సంబంధించి తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులు రాష్ట్రపతి వద్ద, పంచాయతీరాజ్ చట్ట సవరణ ఆర్డినెన్సు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న సంగతిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కోర్టు తుది నిర్ణయం ఆలస్యమైతే పార్టీల పరంగా బీసీలకు 42% టికెట్లు ఇద్దామని ప్రతిపాదించి ఎన్నికలకు వెళ్లడమే ప్రత్యామ్నాయమని చెప్పారు. ఈ నెల 23న జరిగే టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీలో ఏం చేయాలా అన్నదానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. మంగళవారం తన నివాసంలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ కోసమే సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతి ఎన్నికల అభ్యర్థిగా ఇండియా కూటమి ఎంపిక చేసిందని, ఇందులో తన పాత్ర ఏమీ లేదన్నారు. సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో తాను పాల్గొంటానని చెప్పారు. సుదర్శన్‌రెడ్డికి మద్దతు కోసం కేసీఆర్‌ను కలుస్తారా అన్న ప్రశ్నకు అధిష్ఠానం ఏం ఆదేశిస్తే అది చేస్తానన్నారు. ఆయనకు తన ముఖం చూడడం ఇష్టం ఉందో.. లేదోనని అనుమానం వ్యక్తం చేశారు. తాను శాంపిల్ కోసం ఏ స్కీమ్‌లూ పెట్టబోనని, పెట్టిన పథకం గ్రౌండ్ దాకా వెళ్లేలా చూస్తున్నామని చెప్పారు. అడిగిన వాళ్లందరికీ రేషన్ కార్డులు ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్లూ అర్హులకు ఇస్తున్నామని తెలిపారు

మొదటి పేజీ తరువాయి

# ఎన్నికల వ్యవస్థ బలోపేతానికి.. ఆర్నెళ్లలో 28 రకాల చర్యలు: ఈసీ

**ఈ-కబురు: ఓట్ల చోరీ వంటి ఆరోపణలతో ఎన్నికల సంఘాన్ని ప్రతిపక్షాలు లక్ష్యంగా చేసుకున్నాయి. బిహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణపైనా ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ పరిణామాల నడుమే ఈసీ కీలక ప్రకటన చేసింది. ఎన్నికల ప్రక్రియను మరింత మెరుగుపర్చడం, క్రమబద్ధీకరించడమే లక్ష్యంగా గత ఆరు నెలల్లో 28 రకాల చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. మరణాల నమోదు డేటాను అనుసంధానించడం ద్వారా క్షేత్రస్థాయి ఎన్నికల అధికారులకు మృతి చెందిన ఓటర్ల గురించి సకాలంలో సమాచారం అందుతుందని తెలిపింది.ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి.. భాగస్వామ్యపక్షాలతో సంప్రదింపులు; ఎన్నికల వ్యవస్థ బలోపేతం, ప్రక్షాళన; సాంకేతికత వినియోగం పెంపు; ఓటర్ల జాబితాలను సరిచేయడం; ఓటింగ్ ప్రక్రియను సులభతరం చేయడం; ఈసీ సామర్థ్యాలను పెంపొందించడం వంటి విభాగాల్లో చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను కీలక సంస్కరణగా పేర్కొంది. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లు లేకుండా చూసుకోవడమే ఈ ప్రక్రియ ప్రధాన లక్ష్యమని చెప్పింది.ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఎన్నికల సంఘం ఇటీవల ఖండించిన విషయం తెలిసిందే. తమకు ఎలాంటి భేదభావాలు ఉండవని, అన్ని పార్టీలను సమానంగా చూస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఓటర్లపై నకిలీలనే ముద్రవేసే ఎత్తులను తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. 'ఓట్ల చోరీ' ఆరోపణలపై రాహుల్ గాంధీ వారం రోజుల్లోపు అఫిడవిట్ సమర్పించాలని, లేనిపక్షంలో వాటిని నిరాధారమైనవిగా పరిగణిస్తామన్నారు.**

మొదటి పేజీ తరువాయి

# వ్యవసాయ కుటుంబంలో జన్మించి.. ఉప రాష్ట్రపతి అభ్యర్థి స్థాయికి

ఈకబురు: ఉప రాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అనూహ్య నిర్ణయం తీసుకుంది. విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా తెలంగాణకు చెందిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బూచిరెడ్డి సుదర్శన్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం ఇండియా కూటమి నేతలతో కలిసి ఈ మేరకు ప్రకటన చేశారు. దేశంలో రెండో అత్యున్నత పదవికి జరగనున్న ఈ ఎన్నికలను 'సైద్ధాంతిక యుద్ధం'గా ఖర్గే అభివర్ణించారు. అందుకే విపక్షాలన్నీ ఐక్యంగా పోటీ పడుతున్నాయన్నారు. కాగా అధికార బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పక్ష అభ్యర్థి, తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్‌తో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పోటీ పడనున్నారు. సెప్టెంబర్ 9న జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికల కోసం జస్టిస్ సుదర్శన్ రెడ్డి, రాధాకృష్ణన్‌లు బుధవారం తమ నామినేషన్లు దాఖలు చేయనున్నారు. బుధవారం మధ్యాహ్నం సంవిధాన్ సదన్ (పార్లమెంటు పాత భవనం)లో ఇండియా కూటమి సమావేశం జరగనుంది. మంగళవారం మధ్యాహ్నం ఖర్గే నివాసంలో, ఆయన అధ్యక్షతన జరిగిన ఇండియా కూటమి భేటీకి విపక్ష పార్టీల నేతలు శరద్‌పవార్, సంజయ్ రౌత్, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, డెరిక్ ఓబ్రియెన్, కనిమొళి, తిరుచ్చి శివ, జాన్ బ్రిట్టాస్, ధర్మేంద్ర యాదవ్, ప్రమోద్ తివారీ, రజని పాటిల్, అరవింద్ సావంత్, ఎంఏ బేబీ తదితరులు హాజరయ్యారు. అంతా కలిసి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరును విపక్ష కూటమి అభ్యర్థిగా ఖరారు చేస్తూ ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల ఇండియా కూటమి నుంచి వైదొలగిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కూడా ఈ నిర్ణయానికి మద్దతు ప్రకటించింది. ఈ సమావేశానంతరం ఖర్గే విపక్షాల సంయుక్త ప్రకటనను మీడియాకు చదివి విన్పించారు. 'సుదర్శన్ రెడ్డి దీర్ఘకాలం పాటు న్యాయ సేవలందించారు. దేశంలోని ప్రఖ్యాత, ప్రగతిశీల న్యాయవేత్తలలో ఒకరు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా విశిష్టమైన సేవలు అందించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం నిరంతరం పోరాడారు. ఆయన తీర్పుల్లో పేదల పక్షపాతం స్పష్టంగా కనిపిస్తుంది. రాజ్యాంగ పరిరక్షణ, ప్రాథమిక హక్కుల కాపాడేందుకు కృషి చేశారు. విపక్ష పార్టీలన్నీ ఒకే పేరుకు అంగీకారం తెలపడం సంతోషంగా ఉంది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వంపై ఏకగ్రీవ నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఇది ప్రజాస్వామ్యం సాధించిన గొప్ప విజయం. ఎప్పుడైతే ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ముప్పు ఎదురవుతుందో అప్పుడు విపక్షాలన్నీ ఏకమై ఇందుకు వ్యతిరేకంగా పోరాడతాయి..'అని ఖర్గే పేర్కొన్నారు. జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో అనివార్యమైన ఉప రాష్ట్రపతి ఎన్నికను ఏకగ్రీవం చేయాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే చివరివరకు ప్రయత్నించింది. కాంగ్రెస్ సహా అన్ని పార్టీలను రాధాకృష్ణన్‌కు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరింది. ఏ కూటమిలోనూ లేని వైఎస్సార్‌సీపీ, బీజేడీ వంటి పార్టీల అధినేతలతో ఈ మేరకు బీజేపీ నేతలు చర్చలు జరిపారు. మంగళవారం సైతం రాధాకృష్ణన్ ఎన్నికను ఏకగ్రీవం చేయాలని బీజేపీ పిలుపునిచ్చింది. అయితే ఆ విజ్ఞప్తిని తోసిపుచ్చుతూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి దక్షిణాది రాష్ట్రానికే చెందిన రాజకీయేతర వ్యక్తిని బరిలో దింపాలని నిర్ణయించింది. ఊహించని విధంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరును తెరపైకి తెచ్చింది. తద్వారా ఉప రాష్ట్రపతి ఎన్నికను దక్షిణాది వర్సెస్ దక్షిణాది అన్నట్టుగా



మార్చివేసింది. ఎన్డీయే తమ అభ్యర్థిగా..తమిళనాడుకు చెందిన, ఆర్ఎస్ఎస్ నేపథ్యం కలిగిన మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను బరిలోకి దింపిన నేపథ్యంలో.. డీఎంకే ఆయన వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి లోక్‌సభ, రాజ్యసభలో కలిపి మొత్తం 782 మంది ఓటర్లు ఉన్నారు. ఎవరైనా గెలవాలంటే 394 ఓట్లు అవసరం. కాగా ఎన్డీఏకు లోక్‌సభలో 293 మంది, రాజ్యసభలో 129 మంది సభ్యుల (మొత్తం 422) మద్దతు ఉంది. ఇండియా కూటమికి లోక్‌సభలో 234 మంది, రాజ్యసభలో 96 మంది (మొత్తం 330) మద్దతు ఉంది. ఇక ఏ కూటమికీ చెందనివారు 30 మంది ఉన్నారు. ఈ లెక్కల ప్రకారం ఎన్డీఏ ఆధిక్యం సుస్పష్టంగా ఉన్నప్పటికీ, ఎన్నిక ఏకగ్రీవం కాకుండా ప్రతిపక్షాలు తమ అభ్యర్థిని బరిలోకి దింపాయి. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి 1946 జూలై 8న రంగారెడ్డి జిల్లా కందుకూరు రెవెన్యూ మండలం ఇబ్రహీంపట్నం తాలూకా ఆకుల మైలారం గ్రామంలో బూచిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, అనసూయమ్మ దంపతులకు మొదటి సంతానంగా జన్మించారు. వీరిది వ్యవసాయ కుటుంబం. సుదర్శన్‌రెడ్డికి భార్య పద్మారెడ్డి, ఇద్దరు కుమారులు శశిధర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, కుమార్తె సుమిత (ప్రస్తుతం అమెరికాలో) ఉన్నారు. ఆయన ఆకుల మైలారం గ్రామంతో పాటు యాచారం మండలం కుర్మిద్దలోని తన బంధువుల ఇంట్లో ఉంటూ ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఆ తర్వాత పదో తరగతి వరకు హైదరాబాద్ శాలిబండలోని రిఫైన్ ఎయిడెడ్ స్కూల్‌లో చదివారు. నగరంలోని వివేకవర్ధిని కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. ఉస్మానియా వర్సిటీలో ఎల్ఎల్‌బీ చదివారు. 1971లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. సీనియర్ న్యాయవాది కె.ప్రతాప్‌రెడ్డి వద్ద జూనియర్‌గా పనిచేశారు. సిటీ సివిల్ కోర్టు (హైదరాబాద్), ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పలు కేసుల్లో సమర్థవంతమైన వాదనలు వినిపించారు. 1988 ఆగస్టు 8న హైకోర్టులో రెవెన్యూ శాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది (1988-1990)గా నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు స్టాండింగ్ కౌన్సిల్‌గా స్వల్పకాలం విధులు నిర్వర్తించారు. ఏవీ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలోని విద్యా సంస్థలకు కార్యదర్శిగా, కరస్పాండెంట్‌గా పనిచేశారు. 1993-94 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1995 మే 2న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005 డిసెంబర్ 5న గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. 2007 జనవరి 12న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టి.. 2011 జూలై 8న పదవీ విరమణ పొందారు. 2013లో లోక్‌పాల్, లోకాయుక్త చట్టం ఆమోదం పొందిన తర్వాత అదే ఏడాది గోవా తొలి లోకాయుక్తగా నియమితులయ్యారు. అయితే వ్యక్తిగత కారణాలతో అదే ఏడాది ఆ పదవి నుంచి వైదొలిగారు.

**జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వ్యక్తిగత సమాచారం**
**పుట్టిన తేదీ: 1946 జూలై 8**
**పుట్టిన స్థలం: రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం, ఆకులమైలారం గ్రామం**
**తల్లిదండ్రులు: భూచిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, అనసూయమ్మ**
**భార్య: పద్మారెడ్డి**
**కుమారులు: బి.శశిధర్‌రెడ్డి, బి.వంశీదర్‌రెడ్డి**
**కూతురు: సుమిత**

# జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయండి

నిబంధనల ప్రకారమే నిర్మాణం

''కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం నిబంధనల ప్రకారమే జరిగింది. ప్రస్తుత అధికార పార్టీ కాంగ్రెస్.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏదో ఒక సాకుతో ఈ ప్రాజెక్టుకు అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నించింది. ఎన్నికల ప్రచారంలో కూడా దానిపై విమర్శలు గుప్పించింది. దురదృష్టవశాత్తు వివిధ కారణాలతో మేడిగడ్డ బ్యారేజీ ఒక పియర్ కుంగింది. దీనికి డిజైనింగ్, ఇంజినీరింగ్‌తో ఎలాంటి సంబంధంలేదు.

కమిషన్ మమ్మల్ని తప్పుదోవపట్టించింది

గత ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పనలో వచ్చిన పేరును దెబ్బతీయాలన్న ఏకైక లక్ష్యంతో 2014 నుంచి 2023 దాకా మా హోదాలకు సంబంధించిన గత ప్రవర్తనపై ఈ ప్రభుత్వం విచారణకు జస్టిస్ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అది కమిషన్స్ ఆఫ్ ఎంక్వరీ చట్టానికి విరుద్ధం. అలా నియమించే పరిధి ప్రభుత్వానికి లేదు. ఈ చట్టం కింద ఏర్పాటైన కమిషన్‌లకు న్యాయ విచారణలు నిర్వహించే పరిధి లేదు. అవి కేవలం వాస్తవాలను వెల్లడించాలి. గత ప్రవర్తన ఆధారంగా బాధ్యతలను నిర్ధారించలేవు. కానీ కమిషన్ మా ప్రతిష్ఠను ప్రభావితం చేసేలా నివేదిక రూపొందించింది. సాక్షిగా మాకు సమన్లు జారీ చేయడం ద్వారా జస్టిస్ ఘోష్ కమిషన్ మమ్మల్ని తప్పుదోవపట్టించింది. నివేదిక ఓ వ్యక్తి ప్రతిష్ఠపై దుష్ప్రభావం చూపుతుందన్నపుడు నోటీసు జారీ చేయడంతోపాటు ఆ వ్యక్తికి సాక్షులను ప్రశ్నించే అవకాశం కల్పించాలి. అలా అవకాశం ఇవ్వకుండా నివేదిక సమర్పించడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం. జస్టిస్ ఘోష్ కమిషన్ గత నెల 31న ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక పక్షపాతంతో, ముందస్తు నిర్ణయాలతో, మా పరువుకు నష్టం కలిగించే వ్యాఖ్యలతో ఉంది. ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి ఈనెల 4న నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ నేపథ్యంలో ఇలా చెప్పవలసి వచ్చింది. నివేదిక కాపీని మాకు అందజేయకుండా ప్రభుత్వం.. మీడియా ప్రచురణలకు ఇవ్వడం దురుద్దేశపూరితం. సాధారణ ప్రజల దృష్టిలో మమ్మల్ని అప్రతిష్ఠపాల్జేయడమే. అందుకే నివేదికను రద్దుచేయాలి'' అని వారు పిటిషన్‌లలో విజ్ఞప్తి చేశారు.



మొదటి పేజీ తరువాయి

# బిహార్లో ఒక్క ఓటూ తస్కరించనివ్వం



మహారాష్ట్రలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నడుమ మేజిక్ చేసి కోటి మంది కొత్త ఓటర్లను చేర్చారు. మెషీన్‌లో చదవగలిగే ఓటర్ల జాబితాలను మాకివ్వాలని ఈసీని మేం కోరాం. కానీ కమిషన్ దానితోపాటు సీసీటీవీ ఫుటేజ్ ఇవ్వడానికీ నిరాకరించింది. ఇప్పుడు బిహార్లో కొత్త తరహాలో మీ కళ్ల ముందే ఓట్ల చోరీ చేస్తున్నారు. కానీ, బిహార్‌లో ఒక్క ఓటును కూడా దొంగిలించనివ్వం' అని రాహుల్ స్పష్టంచేశారు. ఇప్పుడు మీ ఓట్లు తీసేస్తారు.. తర్వాత రేషన్ కార్డులు తొలగిస్తారు.. అనంతరం మీ భూములు లాక్కుంటారు.. వాటిని అదానీ, అంబానీలకు ఇస్తారని ఆరోపించారు. తప్పుడు చట్టాలు, జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు ఇవన్నీ వారికి మేలు చేయడానికేనని తెలిపారు. అంతకుముందు ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓ వ్యక్తిని రాహుల్ పిలిచి మాట్లాడించారు. లోక్‌సభ ఎన్నికల్లో తాను పోలింగ్ ఏజెంటుగా ఉన్నానని.. ఎస్ఐఆర్‌లో తన పేరు తొలగించారని అతడు చెప్పాడు. బిహార్లో ఇలాంటివారు లక్షల మంది ఉన్నారని.. వారి ఓట్లను జాబితాల నుంచి తొలగించారని రాహుల్ అన్నారు. ఇదిలా ఉండగా, వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత రాహుల్‌గాంధీని ప్రధానిని చేద్దామని తేజస్వి యాదవ్ ఈ ర్యాలీలో పిలుపిచ్చారు. ఆయన కారణంగానే ప్రధాని మోదీ నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారని చెప్పారు.

# విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లను తీసేయండి

ఈకబురు: విద్యుత్ స్తంభాలపై ప్రాణాంతకంగా మారిన కేబుల్ వైర్లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. కేబుల్ వైర్లను తొలగించాలని సంవత్సర కాలంగా కేబుల్ ఆపరేటర్లకు పలుమార్లు నోటీసులు ఇచ్చి.. తగినంత సమయం ఇచ్చామని, అయినా వారు స్పందించకపోవడంతో ప్రజల ప్రాణానికి ముప్పు ఏర్పడిందని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని ఉపేక్షించేది లేదని, రాష్ట్రవ్యాప్తంగా అధికారులు, సిబ్బంది విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లను తొలగించే కార్యక్రమంపై దృష్టి పెట్టాలని సూచించారు. అనుమతులు లేకుండా అక్రమంగా విద్యుత్తు కనెక్షన్లు ఏర్పాటు చేసుకుంటే కఠినంగా స్పందించి, వాటిని తొలగించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడైనా విద్యుత్ శాఖ సిబ్బంది సహాయంతోనే విద్యుత్ కనక్షన్ తీసుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానం లేని వ్యక్తుల ద్వారా కనెక్షన్లు తీసుకోవడం వల్ల ప్రాణాలకు ముప్పు ఏర్పడతోందని హెచ్చరించారు. హైదరాబాద్ మహానగరంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల్లోని పనులను ప్రాధాన్య క్రమంలో చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాల క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం భట్టి విక్రమార్క అధ్యక్షత మంగళవారం సచివాలయంలో జరిగింది. సమావేశంలో కమిటీ సభ్యులైన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క పాల్గొన్నారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందేందుకు పెట్టుబడులు కీలకమని, ఆర్థిక వనరులను జాగ్రత్తగా వినియోగించుకుంటూ ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. ఒకవైపు అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేస్తూనే మరోవైపు ఆదాయాన్ని పెంచేలా అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు

# భారత్‌కు అరుదైన ఖనిజాలు,

## ఎరువులు సరఫరా చేసేందుకు చైనా అంగీకారం

ఈకబురు: న్యూఢిల్లీ, : బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కీలకమైన అరుదైన ఖనిజాలను, కీలకమైన ఎరువులను భారత్‌కు సరఫరా చేసేందుకు చైనా ముందుకొచ్చింది. చైనా కంపెనీలు అరుదైన ఖనిజాలు, ఎరువులు, టన్నెల్ బోరింగ్ యంత్రాలను భారత్‌కు ఎగుమతి చేయడంపై ఉన్న నియంత్రణలను సడలించేందుకు అంగీకరించింది. ఢిల్లీలో విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమైన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఈ మేరకు హామీ ఇచ్చినట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. రెండు రోజుల పర్యటన కోసం ఢిల్లీ వచ్చిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ మంగళవారం ప్రధాని మోదీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో వేర్వేరుగా భేటీ అయ్యారు. చైనా, భారత్ మధ్య గల్వాన్ ఘటన అనంతర ఉద్రిక్తతలను తగ్గించడం, ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం పునరుద్ధరణతోపాటు అమెరికా సుంకాల ప్రభావంపై వారు చర్చలు జరిపినట్టు తెలిసింది. ముఖ్యంగా సరిహద్దుల వద్ద ఉద్రిక్తతల తగ్గింపు కోసం చేపట్టిన 'ప్రత్యేక ప్రతినిధుల (స్పెషల్ రిప్రజెంటేటివ్స్) చర్చల' ప్రక్రియలో భాగంగా దోవల్‌తో వాంగ్‌యీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య సరిహద్దులు ప్రశాంతంగా ఉన్నాయని, సంబంధాలు మెరుగుపడుతున్నాయని ఈ సందర్భంగా దోవల్ పేర్కొన్నారు. ఎస్సీవో సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఆగస్టు 31న చైనా వెళ్లనున్నారని తెలిపారు.

# ఒక్కరోజే 30 సెంటీమీటర్ల వాన

ఈకబురు: ముంబై వరుసగా రెండో రోజూ తడిసిముద్దయింది. మంగళవారం రికార్డు స్థాయిలో 30 సెంటీమీటర్ల వర్షం కురిసింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. వర్షాలకు సంబంధించిన వివిధ ఘటనల్లో మొత్తం పది మంది ప్రాణాలు కోల్పోయారు. మిత్తి నదికి వరద పోటెత్తడంతో లోతట్టు ప్రాంతాల్లోని సుమారు 500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కుండపోత వానల కారణంగా రోడ్డు, రైలు, విమాన సర్వీసులపైనా ప్రభావం తీవ్రంగా పడింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వీధులు నదులను తలపించాయి. వాహనదారులు, ప్రయాణికులు నడుముల్లోతు వరదలోనే ముందుకు సాగాల్సి వచ్చింది. రైలు మార్గాలపై కొన్ని ప్రాంతాల్లో 8 సెంటీమీటర్ల మేర వరద చేరడంతో సెంట్రల్ రైల్వే నడిపే అత్యంత కీలకమైన సబర్బన్ సర్వీసులను రద్దు చేసింది. దీంతో, ప్రయాణికులు ఎక్కడివారక్కడే ఉండిపోయారు. రైళ్లు పట్టాలపైనే నిలిచిపోవడంతో జనం బయటకు దూకి వరద నీళ్లలోనే గమ్యస్థానాలకు కాలినడకన బయలుదేరారు. స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు పనిచేయలేదు. బాంబే హైకోర్టు సైతం మధ్యాహ్నం 12.30 గంటల వరకే పనిచేసింది. సెంట్రల్ రైల్వే దూరప్రాంత రైలు సర్వీసులను రీషెడ్యూల్ లేదా రద్దు చేసింది. ఛత్రపతి శివాజీ టెర్మినస్-థానే మధ్యలో దాదాపు 8 గంటల తర్వాత రాత్రి 7.30 గంటల సమయంలో రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి. సీఎస్ఎంటీ-మన్‌ఖుర్ద్ హార్బర్ లైన్‌లో రైళ్లు మాత్రం నిలిచిపోయాయి. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయానికి 253 విమానాల టేకాఫ్, మరో 163 విమానాల ల్యాండింగ్ ఆలస్యమైంది. దృగ్గోచరత సరిగాలేక 8 విమానాలను దారి మళ్లించినట్లు ముంబై ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.సుమారు 700 మందితో మంగళవారం సాయంత్రం బయలుదేరిన మోనో రైళ్లు రెండు అర్థంతరంగా నిలిచిపోవడంతో ప్రయాణికులు హాహాకారాలు చేశారు. మైసూర్ కాలనీ-భక్తి పార్క్ స్టేషన్ల మధ్యన ఉండగా 6.15 గంటల వేళ విద్యుత్ సరఫరా లోపంతో అర్థంతరంగా నిలిచిపోయింది. ఏసీ పనిచేయకపోవడంతో అందులో ఉన్న 582 మంది గంటపాటు ఉక్కిరిబిక్కిరియ్యారు. స్పృహతప్పిన కనీసం 15 మందిని ఆస్పత్రిలో చేర్పించారు.ఫైర్, మున్సిపల్ సిబ్బంది ప్రయాణికులందరినీ సురక్షితంగా ఖాళీ చేయించి, బస్సులో గమ్యస్థానాలకు పంపించారని సీఎం ఫడ్నవీస్ చెప్పారు. వడాలా స్టేషన్‌కు సమీపంలో 200 మంది ప్రయాణికులతో నిలిచిపోయిన మరో మోనోరైలును అధికారులు విజయవంతంగా వెనక్కి తీసుకెళ్లారు. కాగా, వచ్చే 48 గంటలు అత్యంత కీలకమైన సమయమని సీఎం అన్నారు. ముంబై, థానే, రాయ్‌గఢ్, రత్నగిరి, సింధుదుర్గ్ జిల్లాల్లో హై అలెర్ట్ ప్రకటించామని చెప్పారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని రోడ్డు దాటుతున్న వ్యక్తి మృతి



ఈ-కబురు, శేరిలింగంపల్లి : రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. చందానగర్ బస్టాండ్ వద్ద సోమవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి (60) రోడ్డు దాటుతుండగా పటాన్‌చెరు నుండి సిబిఎస్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు(టీఎస్08జెడ్0170) వేగంగా దూసుకువచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో గుర్తు తెలియని వ్యక్తి తలకు తీవ్ర గాయాలై సంఘటన స్థలిలోనే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న చందానగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## మిస్ యూనివర్స్ ఇండియాగా మాణికా విశ్వకర్మ



జైపూర్,ఈ-కబురు: మిస్ యూనివర్స్ ఇండియా-2025గా రాజస్థాన్‌లోని గంగానగర్ జిల్లా వాసి మాణికా విశ్వకర్మ (22) ఎన్నికయ్యారు. ఈ ఏడాది చివర్లో థాయిలాండ్‌లో జరిగే మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరపున ఆమె ప్రాతినిధ్యం వహిస్తారు. జైపూర్‌లోని జీ-స్టూడియోలో జరిగిన పోటీల్లో ఎంపికైన మాణికా విశ్వకర్మకు 2024 మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా మంగళవారం తెల్లవారుజామున కిరీట ధారణ చేశారు. తాను ఈ స్థాయికి చేరుకోవడానికి తన కుటుంబం/ సామాజిక వర్గం స్థిరమైన మద్దతే కారణమని పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో మాణికా విశ్వకర్మ చెప్పారు. పేద కుటుంబాలకు ఆర్థిక సాయం చేయడం కంటే మహిళావిద్యకే తాను ఓటేస్తానన్నారు. ఈ పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా మిస్ యూనివర్స్ ఇండియా సంస్థ యజమాని నిఖిల్ ఆనంద్, సినీ కథా నాయిక ఊర్వశీ రౌటేలా, అష్లేయ్ రొబెల్లొ, సినీ నిర్మాత ఫర్హాద్ సామ్జీ వ్యవహరించారు.

## శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేద్దాం : కొమిరిశెట్టి సాయిబాబా



సమావేశంలో ప్రసంగిస్తున్న సాయిబాబా



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు

**ఘనంగా బీఆర్ఎస్ ముఖ్య నాయకుల ఆత్మీయ కలయిక**

ఈకబురు, శేరిలింగంపల్లి : ఈనెల 24వ తేదీన నిర్వహించనున్న శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు ముఖ్యఅతిథిగా హాజరవుతున్న ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున తరలిరావాలని సూచించారు. ఈ మేరకు ఆత్మీయ సమావేశం సన్నాహక కార్యక్రమంలో భాగంగా మంగళవారం మియాపూర్ లో నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. కూకట్ పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, వివేకానంద నగర్ కార్పొరేటర్ రోజా దేవిలతో కలిసి ఈ సమావేశానికి హాజరైన కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన నియోజకవర్గం పరిధిలోని మియాపూర్ నరేన్ గార్డెన్స్ లో నిర్వహించే ఆత్మీయ సమావేశానికి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు పార్టీ ముఖ్య నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం భవిష్యత్ కార్యాచరణపై చర్చించడంతో పాటు ప్రజా సమస్యలపై పార్టీ విధివిధానాలను వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివరించనున్నట్లు తెలిపారు. కీలకమైన ఈ సమావేశానికి నియోజకవర్గం పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తెలంగాణవాదులు భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాధవరం రంగారావు, పురుషోత్తం యాదవ్, వాలా హరీష్ రావు, మిద్దెల మల్లారెడ్డి, రవీందర్ యాదవ్, సతీష్‌రావు, రవి యాదవ్, జమీర్, రోజా, కిరణ్ యాదవ్, బాబు మియా, భద్రయ్య, రాగం జంగయ్య యాదవ్, అంజమ్మ, దారుగుపల్లి నరేష్, శామ్లెట్ శ్రీనివాస్ లతో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఈ ఏడాది 15వేల గ్రీన్ విత్తన గణేశ విగ్రహాల పంపిణీ : రీ సస్టైనబులిటీ



గ్రీన్ గణేశ విగ్రహాలతో తనికేళ్ల భరణీ, మధుషాలినీ తదితరులు

**ప్రకృతి నుంచి ఆవిర్భవించి ప్రకృతిలో కలిసిపోవడం : తనికేళ్ల భరణి**
**వ్యర్థాల సేకరణ కోసం 'అక్రి' యాప్ ప్రారంభం**



విత్తన గణేశా విగ్రహాల పంపిణీ రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఈకబురు, శేరిలింగంపల్లి : ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా 15వేల పైచీలుకు గ్రీన్ విత్తన గణేశ విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు రీససైనబులిటీ ప్రకటించింది. బంకమట్టితో రూపొందించిన వినాయక విగ్రహం, సేంద్రీయ ఎరువు, సీడ్ బాల్ మిలితమై ఉంటుందని, ఇంట్లోని పూల కుండీలలో విగ్రహాన్ని నిమజ్జనం చేయడంతో కొత్త మొక్క ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. మంగళవారం నుంచి సెప్టెంబరు 2వ తేదీ వరకు రీసస్టైనబులిటీ, బిగ్ ఎఫ్ఎంల ఆధ్వర్యంలో నగర వ్యాప్తంగా బంకమట్టి విత్తన వినాయక విగ్రహాల పంపిణీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాయదుర్గంలోని మైహోం భుజా ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక గేటెడ్ కమ్యూనిటీ వాసులకు విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాల పంపిణీ రథాన్ని ప్రముఖ నటుడు, రచయిత తనికేళ్ల భరణి, నటి మధుషాలినీ ముఖ్యఅతిథులుగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఆనంతరం రీ సస్టైనబులిటీ ఆధ్వర్యంలో వ్యర్థాల సేకరణ కోసం ఏర్పాటు చేసిన అక్రి యాప్ ను ప్రారంభించారు. పిల్లల వాడిన డైపర్లు, మహిళల శానిటరీ ప్యాడ్లు మొదలుకొని ఇంట్లో ఉపయోగంలో లేని వస్తువులను అక్రీ యాప్ ద్వారా అందజేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ ప్రకృతి నుంచి వచ్చిన వినాయకుడు ప్రకృతిలో లీనమైపోవడం హర్షించదగ్గ విషయమన్నారు. వినాయకుడి నిమజ్జనం తరువాత మొక్క రూపంలో మనముందే స్వామి ప్రకృతిలో ఉండనున్నారని తెలిపారు. నటి మధుషాలినీ మాట్లాడుతూ విఘ్నాలు తొలగిపోవాలని వినాయకుడికి విన్నవిస్తామని, గ్రీన్ విత్తన గణేశ విగ్రహాలతో కాలుష్య విఘ్నాలు తొలగిపోతాయన్నారు. రీసస్టైనబులిటీ ఎండి మసూద్ మాలిక్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవరాత్రులు పూజలు అందుకున్న గణనాథుడిని నిమజ్జనం చేయడం ఎంతో బావోద్వేగంతో కూడుకున్నదని, కానీ విత్తన గ్రీన్ గణేశుడి విగ్రహాలతో నిమజ్జనం తరువాత సైతం మొక్క రూపంలో గణనాథుడు మనతోనే ఉండనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైహోం భుజా అసోసియేషన్ అధ్యక్షుడు రాజు మధనపల్లి, ప్రధాన కార్యదర్శి విద్యారెడ్డి, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్ లో ఘనంగా ఫోటోగ్రఫీ దినోత్సవం



కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటున్న ఫోటోగ్రాఫర్లు

ఈకబురు, శేరిలింగంపల్లి : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను మంగళవారం శేరిలింగంపల్లి పరిధిలోని కొండాపూర్ లో ఘనంగా నిర్వహించారు. కొండాపూర్ శ్రీరామ్ నగర్ కాలనీ ఏ బ్లాక్ లో గల గణేష్ ఫోటో స్టూడియోలో నిర్వహించిన వేడుకల్లో స్థానిక ఫోటోగ్రాఫర్లు భారీ ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోటోగ్రఫీ ఓ అద్భుతమైన కళ అని, ఉత్తమ ఫోటో నాటి సందర్భాన్ని కళ్లకు కడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజు .శేఖర్. హర్ష. మహేష్. శ్రీను .నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజి తరువాయి

## రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొందాం

ఈకబురు: ఉపరాష్ట్రపతి పదవికి రాధాకృష్ణన్ అభ్యర్థిత్వాన్ని బలపరచాలని విపక్షాలను ప్రధాని మోదీ కోరారు. ప్రజాసేవలో సుదీర్ఘకాలం కొనసాగుతున్న ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకొందామని విజ్ఞప్తిచేశారు. ఎన్డీయే కూటమి ఎంపీలతో మంగళవారం ప్రధాని సమావేశమయ్యారు. రాధాకృష్ణన్‌ను ఎంపీలకు పరిచయం చేశారు. ఈ భేటీ వివరాలను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. సింధూ జలాల విషయంలో తొలిప్రధాని నెహ్రూ వ్యవహరించిన తీరును ఈ సమావేశంలో మోదీ తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. నెహ్రూ దేశాన్ని రెండుసార్లు విభజించారని విమర్శించారు. పార్లమెంటు ఆమోదం లేకుండానే పాక్‌తో సింధూజలాల ఒప్పందాన్ని కుదుర్చుకుని ఆయన సంతకాలు చేశారని విమర్శించారు. తన వ్యక్తిగత ప్రతిష్ఠను పెంచుకోవడం కోసం దేశ ప్రయోజనాలను నెహ్రూ తాకట్టుపెట్టారని ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా సింధూజలాల్లో 80 శాతం హక్కు పాకిస్థాన్‌కు పోయిందన్నారు. అందువల్ల ఇది రైతు వ్యతిరేక ఒప్పందమని, విలువైన జలాలు మన రైతులకు అందకుండాపోయాయని ఆయన తెలిపారు.



## మియాపూర్‌లో చైన్ స్నాచర్ అరెస్టు



మియాపూర్ పోలీసుల అదుపులో నిందితుడు

ఈకబురు, శేరిలింగంపల్లి : తన కుమారుడిని స్కూల్ నుండి ఇంటికి తీసుకొని వెళుతున్న ఓ మహిళ మెడలో పుస్తెలతాడును లాకెళ్లిన చైన్ స్నాచర్ ను మంగళవారం మియాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుని వద్ద 26 గ్రాముల బంగారు పుస్తెలతాడును స్వాధీనం చేసుకున్నారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం..
మియాపూర్ జేపినగర్‌కు చెందిన బాలాకుమారి గత నెల 4వ తేదిన సాయంత్రం తన కుమారుడిని నాగార్జున ఎన్‌క్లేవ్‌లోని స్కూల్ నుండి ఇంటికి తీసుకువెళ్తుండగా ఓ దుండగుడు వెనుక నుండి వచ్చి బాలకుమారి మెడలో ఉన్న పుస్తెలతాడును లాక్కొని అక్కడి నుండి పరారయ్యాడు. బాలకుమారి ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. చైన్ స్నాచింగ్‌కు పాల్పడింది మియాపూర్ కాంద్యూర్ 40 నిర్మాణసంస్థలో పెయింటర్‌గా పనిచేస్తున్న బ్రిజేష్ చౌహన్(20)గా గుర్తించి మంగళవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి 26 గ్రాముల బంగారు పుస్తెలతాడును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

## తెలంగాణపై కేంద్రం వివక్ష




**యూరియా ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతున్న మోదీ సర్కారు**
**పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీల నిరసన**
**ధర్నాకు ప్రియాంకగాంధీ మద్దతు**

న్యూఢిల్లీ,ఈకబురు: తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని కాంగ్రెస్ ఎంపీలు ఆరోపించారు. మోదీ సర్కారు ఉద్దేశపూర్వకంగానే తెలంగాణ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. తెలంగాణకు యూరియా ఇవ్వాలని కోరుతూ పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీల నిరసన మంగళవారం కూడా కొనసాగింది. సభ ప్రారంభం కావడానికి ముందు పార్లమెంట్ ఆవరణలోని మకర్ ద్వారం వద్ద తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘురాంరెడ్డి, కడియం కావ్య, బలరాంనాయక్, వంశీకృష్ణ, అనిల్‌కుమార్ యాదవ్, రఘువీర్‌రెడ్డి, సురేశ్ షెట్కార్ సహా ఇతర ఇండియా కూటమి ఎంపీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'మా వాటా మాకు ఇవ్వండి తెలంగాణ రైతుల్ని కాపాడండి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ ఆందోళనలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంకగాంధీ పాల్గొని మద్దతు తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ నిర్వహిస్తున్న యూరియా పోరాటానికి అండగా ఉంటానని ఆమె భరోసా ఇచ్చారు.అనంతరం సభలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్లకార్డు చేతబట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూరియా సమస్య పరిష్కారం కోసం ఢిల్లీలో ఆందోళన కార్యాచరణపై ఎంపీలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. తెలంగాణకు యూరియా ఇవ్వాలంటూ నిరసన, ఆందోళన చేపడుతున్న రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు కేంద్ర మంత్రులనూ కలిసి సమస్యలు వివరిస్తున్నారు. మంగళవారం కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు కాంగ్రెస్ ఎంపీలు వినతిపత్రం అందజేశారు. వారంలో 62 వేల మెట్రిక్ టన్నుల యూరియాను తెలంగాణకు ఇస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు ఎంపీలు తెలిపారు

## 75 టన్నుల పేలోడ్‌ను రోదసిలో ప్రవేశపెట్టేందుకు 40 అంతస్తులంత ఎత్తైన రాకెట్ నిర్మిస్తున్నాం



ఓయూ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్

ఈకబురు: దాదాపు 75 వేల కిలోల పేలోడ్‌ను దిగువ భూకక్ష్యలో ప్రవేశపెట్టడం కోసం.. 40 అంతస్తులంత ఎత్తైన రాకెట్‌ను నిర్మిస్తున్నామని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. అలాగే.. 2035 నాటికి 52 టన్నుల అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించనున్నామని.. వీనస్ ఆర్బిటర్ మిషన్‌పై కూడా ఇస్రో కృషి చేస్తోందని ఆయన వెల్లడించారు. మంగళవారం ఇక్కడ నిర్వహించిన ఉస్మానియా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో పలు అంశాలపై మాట్లాడారు. భారత అంతరిక్ష రంగ పరిశోధనలు అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా సాగుతున్నాయని తెలిపారు. భారతదేశపు తొలి ఉపగ్రహం ఆర్యభట్టను 1975లో ఇతర దేశాల సహకారంతో ప్రయోగించామని.. అప్పట్నుంచీ ఇప్పటిదాకా.. 6000 కిలోల హైత్రూపుట్ జీశాట్ 11 సహా 133 ఉపగ్రహాలను ప్రయోగించామని గుర్తుచేశారు. ఈ సందర్భంగానే ఆయన.. ఇస్రో ప్రస్తుతం తయారుచేస్తున్న భారీ రాకెట్ గురించి ప్రస్తావించారు. కలాం సమయంలో కేవలం 35 కేజీల శాటిలైట్‌ను దిగువ భూకక్ష్యలో ప్రవేశపెట్టేందుకు 17 టన్నుల రాకెట్ ప్రయోగించాల్సి వచ్చిందని.. నేడు 40 అంతస్తుల ఎత్తుతో, 75 టన్నుల పేలోడ్‌ను తీసుకువెళ్లగలిగే సామర్థ్యం కలిగిన రాకెట్ తయారుచేస్తున్నామని వెల్లడించారు.
దాంతోపాటు నావిక్ శాటిలైట్, ఎన్1 రాకెట్ ప్రయోగం తదితర పలు ప్రాజెక్టులపై పనిచేస్తున్నట్టు తెలిపారు. మన రాకెట్లను వినియోగించి అమెరికాకు చెందిన 6500 కేజీల కమ్యూనికేషన్ శాటిలైట్‌ను పంపనున్నట్టు చెప్పారు. భారతీయ రక్షణ రంగ అవసరాల కోసం టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ శాటిలైట్ (టీడీఎస్), మన నౌకాదళం కోసం ప్రత్యేకంగా రూపొందించిన భారతీయ సైనిక సమాచార ఉపగ్రహం జీశాట్ 7 ఆర్ వంటివాటిని ఈ సంవత్సరం ప్రయోగించనున్నామన్నారు. ప్రస్తుతం భారతదేశానికి చెందిన 55 ఉపగ్రహాలు కక్ష్యలో తిరుగుతున్నాయని తెలిపిన ఆయన.. మరో మూడు నాలుగు సంవత్సరాల్లో ఈ సంఖ్య మూడురెట్ల మేర పెరగనుందన్నారు. యాక్సియం4 మిషన్ ద్వారా వాయుసేన పైలట్ శుభాన్షు శుక్లా సంపాదించిన అనుభవం.. మన గగన్‌యాన్ కార్యక్రమానికి ఎంతగానో తోడ్పడనుందని నారాయణన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ కోరినట్లుగా భవిష్యత్‌లో 4050 మంది వ్యోమగాములను తీర్చిదిద్దగలమని ఆయన పేర్కొన్నారు.

**మార్గదర్శకులుగా ఉస్మానియన్లు**
**ఓయూ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**
**ఇస్రో చైర్మన్ నారాయణన్‌కు గౌరవ డాక్టరేట్**
**డాక్టరేట్ అందుకున్న ఎమ్మెల్సీ దయాకర్**

ఉస్మానియా వర్సిటీ పూర్వ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా మార్గదర్శకులుగా ఉన్నారని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. ఓయూ 84వ స్నాతకోత్సవం మంగళవారం వర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ వీ నారాయణన్‌కు ఓయూ గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ అందించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ పట్టాలు పొందిన విద్యార్థులు భవిష్యత్తులో తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. 202223 విద్యా సంవత్సరానికి సంబంధించి 58 మంది విద్యార్థులకు, 202324కు 63 మందికి గవర్నర్, ఇస్రో చైర్మన్, వీసీ కుమార్ మొలుగరం బంగారు పతకాలు ప్రదానం చేశారు. వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన 1261 మంది పరిశోధకులు పట్టాలు అందుకున్నారు. 108 ఏళ్ల ఓయూ చరిత్రలో మొదటిసారిగా రాష్ట్ర గవర్నర్ పేరుతో గిరిజన విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన ఆంగ్లంలో పీహెచ్‌డీ డిగ్రీని కొర్ర పాలెంకోకు అందజేశారు. కళాశాల విద్య కమిషనర్ దేవసేన తన తండ్రి ప్రొఫెసర్ సముద్రాల సత్యనారాయణమూర్తి స్మారక బంగారు పతకాన్ని ఎంబీఏ (ఫైనాన్స్)లో డాక్టర్ చిన్నారికి అందజేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిపాలన వ్యవహారాలు, వాస్తవ పరిస్థితులపై పరిశోధనకు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ డాక్టరేట్ అందుకున్నారు.

# రూ.399కే 'చాట్‌జీపీటీ గో'.. ఫీచర్లు ఇవే!

**భారత్‌లో 'చాట్‌జీపీటీ గో' పేరుతో ఓపెన్ ఏఐ కొత్త సేవలను ప్రకటించింది. రూ.399కే ఈ ప్లాన్ అందుబాటులో ఉండనున్నట్లు తెలిపింది. మెసేజ్‌లు, ఇమేజ్ జనరేషన్, ఫైల్ అప్‌లోడ్‌ల సంఖ్యను భారీగా అనుమతించనుంది. ఇండిక్ లాంగ్వేజీ సపోర్టుతోపాటు యూపీఐతోనూ చెల్లింపులు చేసే సౌలభ్యాన్ని తీసుకొచ్చినట్లు తెలిపింది.**







"ఉచిత ప్లాన్‌తో పోలిస్తే జీపీటీ గో'లో మెసేజ్ లిమిట్, ఇమేజ్ జనరేషన్, ఫైల్ లేదా ఇమేజ్ అప్‌లోడ్‌లు 10 రెట్లు ఎక్కువగా ఉండనున్నాయి. మెమొరీ కూడా ఉచిత ప్లాన్‌తో పోలిస్తే రెండింతలు ఎక్కువగా ఉండనుంది. భారత్‌లో ఓపెన్ ఏఐ టూల్స్‌కు భారీగా పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా ఈ అధునాతన కృత్రిమ మేధ టూల్స్‌ను అందుబాటులో ధరల్లో అందించేందుకు 'చాట్‌జీపీటీ గో' పేరుతో కొత్త ప్లాన్‌ను ప్రవేశపెడుతున్నాం" అని తాజా ప్రకటనలో వెల్లడించింది. ఇదివరకే అందుబాటులో ఉన్న రూ.1999 చాట్‌జీపీటీ ప్లస్ ప్లాన్‌కు అదనంగా ఇది ఉండనుంది. దీంతోపాటు నిపుణులు, సంస్థల కోసం ఇప్పటికే ప్రో ప్లాన్‌కు రూ.19, 900తో అడ్వాన్స్‌డ్ ఫీచర్లను అందిస్తోన్న విషయం తెలిసిందే.

ఇదే విషయాన్ని చాట్‌జీపీటీ వైస్ ప్రెసిడెంట్ అండ్ హెడ్ నిక్ టర్లీ పేర్కొంటూ.. భారత్‌లో లెర్నింగ్, వర్క్, క్రియేటివిటీ, ప్రాబ్లమ్‌సాల్వింగ్ కోసం నిత్యం లక్షలాది మంది యూజర్లు చాట్‌జీపీటీని ఎలా ఉపయోగిస్తున్నారనే విషయం నుంచి ఓపెన్ ఏఐ ప్రేరణ పొందుతోందన్నారు. ఈ నేపథ్యంలో యూపీఐ ద్వారా ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు 'చాట్‌జీపీటీ గో'ను ప్రవేశపెడుతున్నామన్నారు. ధరలు కూడా భారత కరెన్సీలోనే కనిపించనున్నాయన్న ఆయన.. ఇతర దేశాలకు విస్తరించే ముందు భారత్‌లో వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

ఓపెన్ ఏఐ అత్యంత అడ్వాన్స్‌డ్ ఏఐ మోడల్ చాట్‌జీపీటీ 5ను ఇటీవలే పరిచయం చేసింది. ఆ సందర్భంగా ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ మాట్లాడుతూ.. చాట్‌జీపీటీని మార్కెట్‌లలో రెండో స్థానంలో ఉన్న భారత్ త్వరలోనే అతిపెద్ద మార్కెట్‌గా అవతరించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు, నిపుణులు, డెవలపర్లు, క్రియేటర్లు, సంస్థలకు చెందిన లక్షలాది మంది యూజర్లతో వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. ఓపెన్ ఏఐ ఇప్పటివరకు తయారుచేసిన అత్యంత శక్తిమంతమైన మోడల్‌గా దీనిని పేర్కొంది.






## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

మంగళవారం ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు, ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి లాభాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 370.64 పాయింట్లు లేదా 0.46 శాతం లాభంతో 81,644.39 వద్ద, నిఫ్టీ 103.70 పాయింట్లు లేదా 0.42 శాతం లాభంతో 24,980.65 వద్ద నిలిచాయి.

టాప్ గెయినర్స్ జాబితాలో హెచ్‌ఎల్‌ఈ గ్లాస్‌కోట్, కేఐఓసీఎల్, ఐఎఫ్జీఎల్ రిఫ్రాక్టరీస్, వర్ధమాన్ పాలిటెక్స్, భారత్ గేర్స్ వంటి కంపెనీలు చేరాయి. నిట్కో, రిషబ్ ఇన్స్ట్రుమెంట్స్, ఆల్డిజి టెక్, రెలియబుల్ డేటా సర్వీసెస్, SP అప్పారల్స్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.

# అమ్మకాల్లో హవా.. ఉత్పత్తిలో రికార్డ్: ఏకంగా ఐదు లక్షలు

**ఎప్పటికప్పుడు కొత్త కార్లను లాంచ్ చేస్తూ.. వినియోగదారులను ఆకట్టుకుంటున్న మారుతి సుజుకి అమ్మకాల్లో కూడా అరుదైన మైలురాళ్లను చేరుకుంటోంది. దీన్నిబట్టి చూస్తుంటే ఉత్పత్తి కూడా వేగంగా జరుగుతోందని తెలుస్తోంది.**

2023లో మార్కెట్లో లాంచ్ అయిన మారుతి సుజుకి ఫ్రాంక్స్.. ఇటీవల 5,00,000 యూనిట్ల ఉత్పత్తి మైలురాయిని చేరుకుంది. ఈ కారు ప్రతి నెలా 12,000 నుంచి 15,000 యూనిట్ల అమ్మకాలను సాధించగలిగింది. 2023 మార్చిలో ఫ్రాంక్స్ ఉత్పత్తిని ప్రారంభించినప్పటి నుంచి 2023 డిసెంబర్ నాటికి.. కేవలం 9 నెలల్లో కంపెనీ లక్ష యూనిట్లను ఉత్పత్తి చేసింది.




2024 జూన్ నాటికి రెండు లక్షల యూనిట్లు, నవంబర్ 2024 నాటికి 3 లక్షల యూనిట్లు, ఫిబ్రవరి 2025 నాటికి 4 లక్షల యూనిట్ల ఉత్పత్తి జరిగింది. కాగా జులైలో దీని ఉత్పత్తి 5 లక్షల యూనిట్లకు చేరుకుంది. అమ్మకాల్లో కూడా దూసుకెళ్తున్న ఈ SUV మొత్తం 5 వేరియంట్లలో లభిస్తుంది. అవి సిగ్మా, డెల్టా, డెల్టా ప్లస్, జీటా & ఆల్ఫా వేరియంట్స్. వీటి ధరలు రూ. 7.59 లక్షల నుంచి రూ. 13.07 లక్షల (ఎక్స్ షోరూం) మధ్య ఉన్నాయి.

మారుతి ఫ్రాంక్స్ 1.2లీటర్ పెట్రోల్, 1.0లీటర్ టర్బోచార్జ్డ్ పెట్రోల్ ఇంజిన్ ఎంపికలతో వస్తుంది. ఇవి రెండూ 5స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, 6స్పీడ్ ఆటోమేటిక్ టార్క్ కన్వర్టర్ పొందుతాయి. కాబట్టి పనితీరు ఉత్తమంగా ఉంటుంది. ఈ కారు భారతదేశంలో మాత్రమే కాకుండా.. ఇతర దేశాల్లో కూడా మంచి విక్రయాలను పొందుతోంది. ఈ కారణంగానే ఎగుమతుల్లో కూడా దూసుకెళ్తోంది.




## టెక్నాలజీలో కెరీర్ కోసం.. టెక్‌బీ ప్రోగ్రామ్

**ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ అయిన HCLTech.. హైదరాబాద్‌లోని హైస్కూల్ గ్రాడ్యుయేట్ల కోసం టెక్‌బీ ఎర్లీ కెరీర్ ప్రోగ్రామ్‌ను అందించాలని & వారికి టెక్నాలజీ పరిశ్రమలో కెరీర్‌లను నిర్మించుకునే అవకాశాన్ని కల్పించాలని యోచిస్తోంది. దీనికి సంబందించిన మరిన్ని వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం.**

టెక్‌బీ అనేది ప్రత్యేకంగా హైస్కూల్ గ్రాడ్యుయేట్ల కోసం రూపొందించిన ప్రోగ్రామ్. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పరిశ్రమకు సంబంధించిన నైపుణ్యాలను నేర్చుకోగలరు. ఇది టెక్నాలజీలో ప్రపంచ కెరీర్‌లకు పునాదులు వేసుకోవడానికి అనుమతిస్తుంది. ఈ ప్రోగ్రామ్ ప్రముఖ విద్యా సంస్థల సహకారంతో నిర్వహించడం జరుగుతుంది.

టెక్‌బీ గ్రాడ్యుయేట్లు ఇప్పటికే ఏఐ & క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అధునాతన రంగాలలో తమ సహకారాన్ని అందిస్తున్నారు. HCLTech ఫార్చ్యూన్ 500 క్లయింట్‌లకు సేవలు అందిస్తున్నారు.

టెక్‌బీ అనేది స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ వంటి కార్యక్రమాల కంటే ముఖ్యమైంది. ఇది టెక్ రంగంలో కెరీర్‌లను నిర్మించుకోవడానికి సహకరిస్తుందని.. HCLTech సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బరామన్ అన్నారు. బిట్స్ పిలానీ. ఐఐటీ గువహతి, శాస్త్ర యూనివర్సిటీ, అమిటీ యూనివర్సిటీ, ఐఐఐటీ కొట్టాయం, ఐఐఎం సిర్మౌర్ వంటి సంస్థలు ఇందులో భాగస్వాములుగా ఉన్నారు. ఈ కార్యక్రమం యువతకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంపొందిస్తుంది.

# హైదరాబాద్‌లో తలెత్తిన ఇంటర్నెట్ సమస్య

**టీజీఎస్‌పీడీసీఎల్ హైదరాబాద్‌లో కేబుల్స్ తొలగించడం వల్ల, నగరంలో ఫైబర్ టు హోమ్ కనెక్టివిటీ సమస్యలు తలెత్తాయి. ఇది పెద్ద సంఖ్యలో హోమ్ బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులకు అంతరాయాన్ని కలిగించింది.**

**విద్యుత్ శాఖ ఆప్టికల్ ఫైబర్ కేబుల్‌లను విచక్షణారహితంగా.. కత్తిరించడం వల్ల ఈ (ఇంటర్నెట్) అంతరాయం ఏర్పడింది. ఇంటర్నెట్ కేబుల్‌లు విద్యుత్తును తీసుకువెళ్లవని.. దీనివల్ల విద్యుత్ మౌలిక సదుపాయాలకు సంబంధం లేదని సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చెబుతోంది. విచక్షణారహితంగా కేబుల్స్ కట్ చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని శాఖను కోరుతున్నామని వెల్లడించింది.**

**నగరంలో తలెత్తిన సమస్యను పరిష్కరించడానికి.. ఇంటర్నెట్ సేవలను వీలైనంత త్వరగా పునరుద్ధరించడానికి సంబంధిత శాఖ పనిచేస్తోంది. ఇంటర్నెట్ కనెక్టివిటీ దెబ్బతినడం వల్ల చాలా ముఖ్యమైన సేవలు నిలిచిపోతాయి. ప్రస్తుతం ఈ ప్రభావం జియో, ఎయిర్‌టెల్‌లకు చెందిన దాదాపు 40 వేల ఫైబర్ కస్టమర్లపై పడింది.**




# '90 పని గంటల'పై వ్యాఖ్యలు.. నా భార్య కూడా బాధ పడింది: ఎల్ అండ్ టీ సీఎండీ

వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారం సెలవును కూడా వదిలేయాలని ఎల్ అండ్ టీ సీఎండీ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ గతంలో చేసిన వ్యాఖ్యలు ఆన్‌లైన్‌లో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను పలువురు ప్రముఖులు వ్యతిరేకించారు. ఈవిషయంపై తాజాగా సుబ్రహ్మణ్యన్ మాట్లాడుతూ.. గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై విచారం వ్యక్తంచేశారు. భార్యను ఎంతసేపు చూస్తూ ఉండిపోతారని అన్న మాటలకు తన భార్య కూడా బాధ పడిందని.. ఇకపై అటువంటి విషయాల్లో ఆచితూచి మాట్లాడతానని అన్నారు. కంపెనీకి సంబంధించిన ముఖ్యమైన ప్రాజెక్టుల్లో జాప్యం జరుగుతున్నట్లు ఫిర్యాదు అందడంతో అప్పుడు అలా మాట్లాడానని.. అంతేకానీ ఉద్దేశపూర్వకంగా మాట్లాడలేదని ఆయన స్పష్టం చేశారు.

"పని గంటల గురించి మాట్లాడిన సమయంలో కంపెనీకి సంబంధించిన సమస్యల గురించి ఆందోళనలో ఉన్నాను. మా కంపెనీకి సంబంధించిన కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టుల్లో జాప్యం జరుగుతుందని కొందరు హైప్రొఫైల్ క్లయింట్లు వ్యక్తిగతంగా నాకు ఫిర్యాదు చేశారు. అత్యుత్తమ పని తీరే మనకు ప్రాణ వాయువు కాబట్టి.. నా సంస్థలో పనులు జరగకపోవడంతో ఆందోళనలో ఆ సమయంలో అలా మాట్లాడాను. అదే.. వేరే పరిస్థితుల్లో అయితే మరోలా మాట్లాడేవాడిని. 'ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారు' అన్న మాటలకు నా భార్య కూడా బాధ పడింది" అని సుబ్రహ్మణ్యన్ పేర్కొన్నారు.

కాగా వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారం సెలవునూ వదిలేయాలని ఎల్ అండ్ టీ సీఎండీ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు గతంలో ఆన్‌లైన్‌లో దుమారాన్నే లేపాయి. 'ఆదివారాలు మీతో పని చేయించలేకపోతున్నందుకు చింతిస్తున్నాను. మీతో అలా పని చేయించగలిగితే.. నాకు సంతోషం. ఎందుకంటే నేను ఆదివారాలు పని చేస్తున్నాను' అంటూ వారితో మాట్లాడిన ఒక వీడియో సామాజిక మాధ్యమాల్లో కనిపించింది. 'ఇంట్లో కూర్చొని ఏం చేస్తారు. ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారు. ఇంట్లో తక్కువ సమయం, ఆఫీసులో ఎక్కువ సమయం ఉంటామని భార్యలకు చెప్పాలంటూ' చేసిన వ్యాఖ్యలు నెట్టింట్లో వైరల్ కాగా.. నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేశారు. ఉన్నతహోదాలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడటం చూసి ఆశ్చర్యానికి గురయ్యానంటూ బాలీవుడ్ కథానాయిక దీపికా పదుకొణె అసహనం వ్యక్తంచేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త హర్ష్ గోయెంకా సైతం సుబ్రహ్మణ్యన్ మాటలను వ్యతిరేకించారు. బానిసలా కష్టపడటాన్ని కాకుండా తెలివిగా పనిచేయడాన్ని తాను నమ్ముతానని తెలిపారు.





# బిగ్‌బాస్ రియాలిటీ షో.. స్పెషల్ గెస్ట్‌గా సోనాలి బింద్రే!

బుల్లితెర ప్రియులను అలరిస్తోన్న బిగ్గెస్ట్ రియాలిటీ షో బిగ్‌బాస్. ఈ షోకు ఫ్యాన్స్‌లో విపరీతమైన క్రేజ్ ఉంది. ప్రత్యేకంగా ఫ్యాన్స్ ఉన్నారు. దీంతో మరో సీజన్ బుల్లితెర ప్రియులను అలరించేందుకు వస్తోంది. ఇప్పటికే కంటెస్టెంట్స్ ఎవరనేది దాదాపు ఖరారు కాగా.. ఈనెల 24 బిగ్‌బాస్ సీజన్-19 షురూ కానుంది. ఈ ఏడాది కూడా స్టార్ హీరో సల్మాన్ ఖాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు.

అయితే ఈ సీజన్‌లో స్టార్ హీరోయిన్ సోనాలి బింద్రే గెస్ట్‌గా వస్తారని బాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. తాను హోస్ట్‌గా వ్యవహరిస్తోన్న కొత్త రియాలిటీ షో 'పతి పత్నీ ఔర్ పంగా' ప్రమోషన్స్ కోసం బిగ్‌బాస్ హౌస్‌లో అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. కాగా.. సోనాలి బింద్రే, సల్మాన్ ఖాన్‌తో 'హమ్ సాత్ సాత్ హై' చిత్రంలో హీరోయిన్‌గా నటించింది. దాదాపు 26 ఏళ్ల తర్వాత వీరిద్దరు కలవనున్నారు. దీంతో సల్మాన్ ఖాన్, సోనాలి బింద్రే ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

కాగా.. 1999లో సూరజ్ బర్జాత్య దర్శకత్వం వహించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ హమ్ సాత్ సాత్ హై చిత్రంలోలో సోనాలి, సల్మాన్ ఖాన్ జంటగా నటించారు. ఈ చిత్రంలో టబు, సైఫ్ అలీ ఖాన్, కరిష్మా కపూర్, అలోక్ నాథ్, రీమా కీలక పాత్రల్లో నటించారు. మరోవైపు సల్మాన్ ఖాన్ బిగ్‌బాస్ రియాలిటీ నాలుగో సీజన్ నుంచి హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సీజన్ ఆగస్టు 24 నుంచి జియో హాట్‌స్టార్, కలర్స్ టీవీలో స్ట్రీమింగ్ కానుంది.



# థగ్ లైఫ్ డిజాస్టర్.. మీరనుకునే వ్యక్తి కాదన్న శృతిహాసన్



**కోలీవుడ్ భామ శృతి హాసన్ తాజాగా కూలీ మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. రజినీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తోంది. ఈ చిత్రంలో టాలీవుడ్ స్టార్ నాగార్జున అక్కినేని కీలక పాత్రలో కనిపించారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన శృతి హాసన్ తన తండ్రి మూవీ థగ్ లైఫ్‌పై స్పందించింది. కమల్ హాసన్ హీరోగా వచ్చిన ఈ సినిమా ఫెయిల్యూర్ గురించి మాట్లాడింది.**

తన తండ్రికి డబ్బు ముఖ్యం కాదని శృతి హాసన్ తెలిపింది. సినిమా సక్సెస్ కావడానికి కేవలం కలెక్షన్ నంబర్స్ ప్రామాణికం కాదని వెల్లడించింది. నేను కూడా ఒక నటిగా ఆ విషయం గురించి ఎప్పుడు ఆలోచించలేదు.. ఇది రూ. 200 కోట్ల సినిమానా, రూ.300 కోట్ల సినిమానా అని తాను కూడా పట్టించుకోనని పేర్కొంది. నాకు చివరి విడత చెల్లింపులు వచ్చాయన్నదే మాత్రమే చూస్తానని తెలిపింది.

నాన్న సంపాదించిన డబ్బునంతా సినిమాల్లో పెట్టేందుకు వెనకాడని మనస్తత్వం ఉన్న వ్యక్తి అని శృతిహాసన్ అన్నారు. సినిమాల్లో వచ్చిన డబ్బును ఆయన రెండో ఆస్తిగానో.. లేదంటే మూడో కారు కొనేందుకో ఖర్చు చేయలేదని తెలిపారు. తన తండ్రి డబ్బు అంతా తిరిగి సినిమాల్లోనే పెట్టారని వెల్లడించారు. మీరు ఊహించిన విధంగా బాక్సాఫీస్ నంబర్స్ ఆయనను ఎలాంటి ప్రభావితం చేస్తాయని తాను అనుకోవడం లేదన్నారు.

కాగా.. దాదాపు 38 ఏళ్ల తర్వాత కమల్ హాసన్ మణిరత్నం కాంబోలో థగ్ లైఫ్ సినిమాను తెరకెక్కించారు. నాయకన్ తర్వాత వచ్చిన సినిమా కావడంతో అభిమానులు సైతం భారీ అంచనాలే పెట్టుకున్నారు. కానీ ఊహించని విధంగా 'థగ్ లైఫ్' బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా నిరాశపర్చింది. ఈ చిత్రంలో శింబు, త్రిష కృష్ణన్, నాజర్, జోజు జార్జ్, అభిరామి, ఐశ్వర్య లక్ష్మి, అశోక్ సెల్వన్ కీలక పాత్రల్లో నటించారు. భారీ బడ్జెట్‌తో ని ర్మించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 100 కోట్ల కంటే తక్కువ వసూళ్లు సాధించి డిజాస్టర్‌గా మిగిలి పోయింది.

# కోలీవుడ్ మూవీలో విలన్‌గా సుహాస్.. లుక్ అదిరింది!

**టాలీవుడ్ యంగ్ హీరో సుహాస్ కోలీవుడ్ ఎంట్రీ ఇచ్చాడు. 'సెల్ఫీ' ఫేమ్ మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో 'మండాడి' అనే సినిమా చేస్తున్నాడు. ఇందులో సూరి హీరోగా నటించగా, సుహాస్ తొలిసారి విలన్ పాత్ర పోషించాడు. సుహాస్ బర్త్‌డే సందర్భంగా నేడు(ఆగస్ట్ 19) కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ చిత్రం కోసం సుహాస్ తన లుక్స్ మొత్తాన్ని మార్చుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు వచ్చిన పోస్టర్లు, కొత్త లుక్ ఇప్పటికే దృష్టిని ఆకర్షిస్తున్నాయి.**




బర్త్ డే విషెస్ చెబుతూ వదిలిన ఈ కొత్త పోస్టర్ కూడా అందరినీ మెప్పించేలా ఉంది.సూరి, సుహాస్‌లతో పాటు మహిమా నంబియార్ ఈ చిత్రంలో ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. సత్యరాజ్, రవీంద్ర విజయ్, అచ్యుత్ కుమార్ వంటి అనుభవజ్ఞులైన ప్రతిభావంతులు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. క్రీడ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మనుగడ, వ్యక్తిగత గుర్తింపు, అజేయమైన మానవ స్ఫూర్తి వంటి అంశాలను ప్రధానంగా చూపించనున్నారు. ఈ మూవీకి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తున్నారు.

# సితార పోస్ట్ వైరల్.. ఇంతకీ ఏమైంది?

**ఇప్పడంతా సోషల్ మీడియా జమానా. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు అన్ని రకాల ఫ్లాట్‌ఫామ్స్‌లో కనిపిస్తున్నారు. అయితే సోషల్ మీడియా వల్ల మంచి ఉన్నట్లే చెడు కూడా బోలెడంత ఉంది. ఫేక్ అకౌంట్ల బాధ గురించి కొత్తగా చెప్పనక్కర్లేదు. సెలబ్రిటీలు, వాళ్ల పిల్లలు వీటి బారిన పడుతుంటారు. ఇప్పడు మహేశ్ బాబు కూతురు సితారకు కూడా అలాంటి అనుభవమే ఎదురైనట్లు ఉంది. దీంతో ఓ పోస్ట్ పెట్టింది. క్లారిటీ ఇచ్చింది.**

'నా పేరు మీద పలు ఫేక్ అకౌంట్స్ ఉన్నట్లు దృష్టికి వచ్చింది. ఫ్రెండ్స్, ఫ్యామిలీ.. నాకు ఇన్‌స్టాగ్రామ్‌లో మాత్రమే అకౌంట్ ఉంది. ఇదే నా అఫీషియల్. ఏదైనా చెప్పాలనుకుంటే దీని ద్వారా చెబుతా. వేరే ఏ సోషల్ మీడియాలోనూ నాకు ఖాతా లేదు' అని సితార ఇన్ స్టాలో పోస్ట్ పెట్టింది. మరి సితారకు ఈ మధ్య కాలంలో ఫేక్ అకౌంట్స్ వల్ల ఏదైనా సమస్య ఎదురైందేమోనని అనిపిస్తుంది. లేదంటే సడన్‌గా ఇప్పుడెందుకు ఈ పోస్ట్ పెడుతుంది?

సితార విషయానికొస్తే క్లాసికల్ డ్యాన్స్ లాంటివి నేర్చుకుంటుంది. ప్రస్తుతానికైతే టీనేజర్. నటి అవుతానని గతంలో ఓసారి చెప్పింది. మరి ఎప్పుడు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తుందో చూడాలి? మహేశ్ బాబు విషయానికొస్తే రాజమౌళితో సినిమా చేస్తున్నారు. పదిరోజుల క్రితం మహేశ్ పుట్టినరోజు సందర్భంగా ఏదైనా అప్డేట్ వస్తుందని అభిమానులు ఎదురుచూశారు కానీ నవంబరులోనే అలాంటివి ఉంటాయని రాజమౌళి క్లారిటీ ఇచ్చారు.



# డిఫరెంట్ పాత్రలో రష్మిక.. టీజర్ రిలీజ్

ప్రస్తుతం పాన్ ఇండియా హీరోయిన్లలో టాప్‌లో దూసుకుపోతున్న రష్మిక.. వరస సినిమాలతో బిజీగా ఉంది. ఈమె హిందీలో చేసిన లేటెస్ట్ మూవీ 'థామా'. 'స్త్రీ' యూనివర్స్‌లో భాగంగా వస్తున్న నాలుగో మూవీ ఇది. ఇంతకుముందు భేడియా, స్త్రీ, ముంజ్య చిత్రాలు వచ్చాయి. ప్రేక్షకుల్ని అలరించాయి. ఇప్పుడు 'థామా' పేరుతో ఈ మూవీలో రష్మిక, ఆయుష్మాన్ ఖురానా జంటగా నటించారు. తాజాగా టీజర్‌ని 'వరల్డ్ ఆఫ్ థామా' పేరుతో రిలీజ్ చేశారు.

గతంలో రష్మిక చెప్పినట్లు అతీంద్రియ శక్తులతో కూడిన రొమాంటిక్ సినిమాగా 'థామా' తీశారు. టీజర్‌లో రష్మిక.. ఇదివరకు ఎన్నడూ చూడనటువంటి పాత్రలో కనిపించింది. బోల్డ్‌గా కనిపిస్తూనే భయపెట్టింది కూడా. ఇందులో రష్మిక, దెయ్యంగానూ యాక్ట్ చేసినట్లు అనిపిస్తుంది. ఈ సినిమాకు ఆదిత్య సర్పోట్దర్ దర్శకుడు. హారర్ స్టోరీ అయినప్పటికీ.. ప్రేమకథని కూడా చూపించబోతున్నారు. ఈ దీపావళికి మూవీ థియేటర్లలోకి రానుంది.




# ఫరియా అబ్దుల్లా లేటేస్ట్ మూవీ.. లిరికల్ సాంగ్ వచ్చేసింది

**నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తోన్న తాజా చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. ఈ చిత్రాన్ని డా. సంధ్య గోలీ సమర్పణలో వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. ఈ మూవీని డార్క్ కామెడీ కథగా దర్శకుడు మురళీ మనోహర్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఏదోటి చేయ్ గుర్రం పాపిరెడ్డి అంటూ సాగే లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు.**

ఈ పాటకు సురేష్ గంగుల లిరిక్స్ అందించగా.. లక్ష్మి మేఘన, ఎంసీ చేతన్ పాడారు. కృష్ణ సౌరభ్ ఈ సాంగ్‌ను కంపోజ్ చేశారు. ఈ చిత్రంలో బ్రహ్మానందం, యోగి బాబు, ప్రభాస్ శ్రీను, రాజ్ కుమార్ కసిరెడ్డి, జీవన్ కుమార్, వంశీధర్ కోసిగి, జాన్ విజయ్, మొట్ట రాజేంద్రన్ కీలక పాత్రలు పోషించారు. కాగా.. ఈ సినిమకాు కృష్ణ సౌరభ్ సంగీతమందిస్తున్నారు.





## డోపింగ్‌లో దొరికిన ట్రిపుల్ జంపర్ షీనా

**'నాడా' సస్పెన్షన్ వేటు**

**న్యూఢిల్లీ:** జాతీయ స్థాయిలో పతకాలెన్నో సాధించిన ట్రిపుల్ జంపర్ షీనా వార్కే డోపింగ్‌లో దొరికిపోయింది. ఆమె నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు తేలడంతో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) ఆమెపై సస్పెన్షన్ వేటు వేసింది. కేరళకు చెందిన 32 ఏళ్ల షీనా ఈ ఏడాది ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ క్రీడల్లోనూ రజత పతకంతో మెరిసింది. ఫెడరేషన్ కప్‌లో కాంస్యం గెలుచుకుంది. ఆసియా ఇండోర్ చాంపియన్‌షిప్ (2018)లో రజతం గెలిచింది. రెండేళ్ల క్రితం హాంగ్జౌ ఆసియా క్రీడల్లో కూడా ఆమె పోటీపడింది. డోపింగ్‌లో పట్టుబడిన షీనాను సస్పెండ్ చేస్తున్నట్లు 'నాడా' వర్గాలు తెలిపాయి. అయితే ఆమె తీసుకున్న ఉత్ప్రేరకాలేంటో నాడా బహిర్గతపరచలేదు. డోపింగ్ పాజిటివ్ ఫలితాల రేటింగ్‌లో భారత్ 3.8 శాతంతో చైనా, అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, రష్యాల కంటే ముందువరుసలో నిలవడం భారత క్రీడల ప్రతిష్టను మసకబారుస్తోంది. ఒక్క అథ్లెటిక్స్‌లోనే ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) జరిపిన పరీక్షల్లో 1223 పాజిటివ్ కేసులుంటే ఇందులో 61 మంది భారత అథ్లెట్లు ఉండటం క్రీడావర్గాలను కలవరపెడుతోంది.



## శ్రేయస్ అయ్యర్‌ను అందుకే సెలెక్ట్ చేయలేదు: అజిత్ అగార్కర్

గత కొన్ని రోజులుగా అద్భుత ప్రదర్శన చేస్తున్నప్పటికీ టీమిండియా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్.. ఆసియాకప్ 2025 కోసం ఎంపిక చేసిన జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. దీనిపై బీసీసీఐని ఉద్దేశించి ఫ్యాన్స్.. విమర్శలు గుప్పిస్తున్నారు. వరుసగా రెండు పర్యాయాలు తన జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లిన వ్యక్తి, బ్యాటింగ్‌లో 150కి పైగా స్ట్రైక్‌రేట్‌తో రన్స్ చేసిన ఆటగాడిని ఎందుకు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో టీమిండియా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ .. ఈ విషయంపై స్పందించాడు. శ్రేయ్ అయ్యర్‌ను ఎందుకు తీసుకోలేదో వివరణ ఇచ్చాడు.

"ఆసియాకప్ 2025 జట్టులో ఎంపిక కాకపోవడంలో శ్రేయస్ అయ్యర్ తప్పు లేదు. కానీ అతడిని ఎవరి ప్లేసులో తీసుకోవాలో చెప్పండి? అతడు మెరుగైన ఆటగాడే అయినా.. ప్రస్తుత పరిస్థితుల్లో తీసుకోలేకపోయాం. ప్రస్తుతానికి అతడు తన అవకాశం కోసం ఎదురుచూడాల్సిందే" అని అజిత్ అగార్కర్ వ్యాఖ్యానించాడు. కాగా ఈ వివరణ పట్ల టీమిండియా క్రికెట్ ఫ్యాన్స్ సంతృప్తి చెందలేదు. 15 మంది ఆటగాళ్లలో ఫిట్ కానప్పుడు.. రిజర్వ్ ఆటగాళ్ల లిస్ట్‌లో అయినా ఉండాలి కదా అని ప్రశ్నిస్తున్నారు. ఆసియాకప్ కోసం టీమిండియా స్టాండ్‌బై ప్లేయర్లుగా ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్, యశస్వి జైశ్వాల్ ఎంపికయ్యారు. దీంతో ఇందులో కూడా శ్రేయస్ అయ్యర్‌కు చోటు దక్కకపోవడం ఏంటని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. అయ్యర్ ఏం తప్పు చేశాడని పేర్కొంటున్నారు.





## ఎయిర్ పిస్టల్‌లో భారత్‌కు రజతం

**ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్ పతక విజేతలు**

**షిమ్‌కెంట్ (కజకిస్థాన్):** ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ బోణీ కొట్టింది. పురుషుల ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగంలో రజతం గెలుచుకుంది. సోమవారం అన్మోల్ (580), ఆదిత్య మాల్రా (579), సౌరభ్ చౌదరి (576)లతో కూడిన భారత జట్టు 1735 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. చైనా (1744) స్వర్ణం నెగ్గగా.. ఇరాన్ (1733) కాంస్యాన్ని సొంతం చేసుకుంది. పురుషుల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో అన్మోల్ ఆరో స్థానంతో సరిపెట్టుకున్నాడు. క్వాలిఫికేషన్‌లో 580 పాయింట్లతో ఏడో స్థానంతో ఫైనల్ చేరిన అతడు.. పతక రౌండ్లో రాణించలేకపోయాడు. ఆదిత్య (579), సౌరభ్ చౌదరి (576) క్వాలిఫికేషన్లోనే వెనుదిరిగారు. 20 ఏళ్ల అమిత్‌శర్మ క్వాలిఫికేషన్లో 588 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. కానీ అతడు 'ర్యాంకింగ్ పాయింట్స్ ఓన్లీ' విభాగంలో పోటీలో ఉండడంతో ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయాడు. జూనియర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో కపిల్ పసిడి గెలిచాడు. ఫైనల్లో 243 పాయింట్లతో అతడు అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఇదే విభాగంలో మరో భారత కుర్రాడు గవిన్ ఆంథోని (220.7) కాంస్యం సాధించాడు. గవిన్, కపిల్, విజయ్ తోమర్‌లతో కూడిన జూనియర్ జట్టు (1723) రజతం గెలిచింది

# ఆసియా కప్‌కి భారత జట్టు ప్రకటన..

## ఆ స్టార్ ప్లేయర్‌కు మళ్లీ షాక్ ఇచ్చిన బీసీసీఐ

**ఆసియాకప్ 2025 కోసం టీమిండియా జట్టును ప్రకటించారు. టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ టీ20 జట్టులోకి వచ్చాడు. అది కూడా వైస్‌కెప్టెన్‌గా. ఇటీవల ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో రాణించిన అతడికి.. టీ20 జట్టు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పజెప్పారు. శ్రేయస్ అయ్యర్‌కు మాత్రం నిరాశే ఎదురైంది. అతడిని జట్టులోకి తీసుకోలేదు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో మొత్తం 15 సభ్యులను బీసీసీఐ ప్రకటించింది.**

ఇదిలా ఉండగా.. శ్రేయస్ అయ్యర్‌ను జట్టులోకి తీసుకోకపోవడంపై క్రికెట్ ప్రియులు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. ఐపీఎల్‌లో వరుసగా రెండుసార్లు (2024, 2025) జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లిన కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ నిలిచాడు. 2024లో తన సారథ్యంతో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు ఐపీఎల్ కప్పు అందించాడు. 2025లో తన జట్టును రన్నరప్ (పంజాబ్ కింగ్స్)గా నిలిపాడు. 2023 వన్డే ప్రపంచకప్‌లోనూ మంచి ప్రతిభ కనబర్చాడు. అలాంటి శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేయకపోవడంపై చర్చ జరుగుతోంది.

**ఆసియా కప్ షెడ్యూల్**

యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు




ఆసియాకప్ 2025 జరగనుంది. ఈ టోర్నీలో భారత్ సహా మొత్తం ఎనిమిది దేశాలు పాల్గొననున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో టీమిండియా బరిలోకి దిగనుంది. ఫైనల్‌తో కలిపి మొత్తం 19 మ్యాచ్‌లు టీ20 ఫార్మాట్‌లో జరుగుతాయి. 8 టీమ్‌లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. ఇందులో గ్రూప్ ఏలో భారత్, పాకిస్థాన్, యూఏఈ, ఒమన్ ఉన్నాయి. గ్రూప్ బిలో శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, హాంకాంగ్ జట్లు ఉన్నాయి. తొలుత గ్రూప్ స్టేజ్, ఆపై సూపర్4 మ్యాచ్‌లు జరుగుతాయి. సూపర్4లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య సెప్టెంబర్ 28న ఫైనల్ జరుగుతుంది.

**ఆసియా కప్‌లో టీమిండియా షెడ్యూల్..**

**10 సెప్టెంబర్: భారత్ - యూఏఈ**
**14 సెప్టెంబర్: భారత్ - పాకిస్థాన్**
**19 సెప్టెంబర్: భారత్ - ఒమన్**

**ఆసియాకప్ కోసం భారత జట్టు:**
**సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబె, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), హర్షిత్ రాణా, రింకూ సింగ్.**

**ఆసియాకప్ 2025 కోసం భారత స్టాండ్‌బై ప్లేయర్లు:**
**ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్, యశస్వి జైశ్వాల్.**

# మహిళల వన్డే ప్రపంచకప్ 2025కు భారత జట్టు ప్రకటన.. లేడీ సెహ్వాగ్ ఔట్.. ఇద్దరు తెలుగు ప్లేయర్లకు చోటు..!

**సెప్టెంబర్ 30 నుంచి భారత్ వేదికగా జరగనున్న మహిళల వన్డే ప్రపంచకప్ 2025 కోసం టీమిండియా జట్టు ఖరారైంది. ఈ మేరకు బీసీసీఐ మహిళల సెలక్షన్ కమిటీ నేడు టీమిండియా జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. స్మృతి మంధాన డిప్యూటీగా వ్యవహరించనుంది. ఈ జట్టులో ఇద్దరు తెలుగు ఆటగాళ్లకు చోటు దక్కింది. మరోవైపు లేడీ సెహ్వాగ్.. షెఫాలీ వర్మకు మాత్రం నిరాశే ఎదురైంది.**

**తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు ప్లేయర్లకు చోటు**
**సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 2 వరకు మెగా టోర్నీ**

పురుషుల ఆసియాకప్ 2025 కోసం జట్టును ప్రకటించిన కాసేపటికే.. మహిళల వన్డే ప్రపంచకప్ కోసం భారత జట్టును బీసీసీఐ ఖరారు చేసింది. ఈ మేరకు ముంబైలో సమావేశమైన బీసీసీఐ మహిళల సెలక్షన్ కమిటీ.. మహిళల వన్డే ప్రపంచకప్ 2025 బరిలోకి దిగే భారత జట్టును ప్రకటించింది. భారత మహిళల చీఫ్ సెలెక్టర్ నీతూ డేవిడ్.. విలేకరుల సమావేశంలో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని 15 మంది సభ్యుల జట్టు వివరాలను వెల్లడించారు. ఈ సమావేసంలో హర్మన్ ప్రీత్ కౌర్ కూడా పాల్గొంది.

మహిళల వన్డే ప్రపంచకప్ 2025కి ముందు ఆస్ట్రేలియాతో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు సైతం భారత జట్టును ప్రకటించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నుంచి భారత్ వేదికగా మహిళల వన్డే ప్రపంచకప్ జరగనుంది. పాకిస్థాన్ ఆడే మ్యాచ్‌లు మాత్రం శ్రీలంక వేదికగా జరుగుతాయి. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్.. సెప్టెంబర్ 14, 17, 20 తేదీల్లో జరుగుతుంది. సెప్టెంబర్ 30 నుంచి వన్డే వరల్డ్ కప్ ప్రారంభం కానుంది. నవంబర్ 2న జరిగే ఫైనల్‌తో విజేత ఎవరో తేలిపోనుంది. ఇక ఈ రెండు జట్లకు హర్మన్‌కు డిప్యూటీగా స్మృతి మంధాన వ్యవహరించనుంది. ఈ జట్టులో తెలుగు రాష్ట్రాలకు చెందిన అరుంధతి రెడ్డి, శ్రీ చరణి చోటు దక్కించుకున్నారు. కడపకు చెందిన నల్లపురెడ్డి శ్రీ చరణి లెఫ్టార్మ్ స్పిన్నర్. ఇదే ఏడాదిలో టీమిండియా తరపున డెబ్యూ చేసిన ఆమె.. మెరుగైన ప్రదర్శన చేసి వన్డే ప్రపంచకప్ జట్టులో చోటు సంపాదించింది. ఇక హైదరాబాద్ ప్లేయర్ అరుంధతి రెడ్డికి సైతం ఈ జట్టులో చోటు దక్కింది. మరోవైపు లేడీ సెహ్వాగ్ పేరు పొందిన షెఫాలీ వర్మకు నిరాశ ఎదురైంది. ఇటీవల ఆమె ఆశించిన మేర రాణించకపోవడం.. ఆమె ప్లేసులో ఓపెనర్‌గా వచ్చిన ప్రతికా రావల్ రాణిస్తుండటంతో సెలక్టర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు.

**మహిళల వన్డే ప్రపంచకప్‌కు భారత జట్టు:**
**హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతికా రావల్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, రిచా ఘోష్ (వికెట్ కీపర్), క్రాంతి గౌడ్, అమన్‌జోత్ కౌర్, రాధా యాదవ్, శ్రీ చరణి, యస్తిక భాటియా (వికెట్ కీపర్), స్నేహ్ రాణా**




# రోహిత్ శర్మ.. 2027 వన్డే వరల్డ్ కప్ వరకు కెప్టెన్‌గా ఉండాలి: అంబటి రాయుడు

**హిట్ మ్యాన్.. రోహిత్ శర్మ భారతజట్టు వన్డే జట్టు కెప్టెన్‌గా 2027 వరల్డ్ కప్ వరకూ కొనసాగాలని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు అంటున్నాడు. అతడు వన్డే మ్యాచుల్లో టీమ్ఇండియాకు చక్కగా దిశానిర్దేశం చేస్తాడని అభిప్రాయపడ్డాడు.**

**'వచ్చే వరల్డ్ కప్ వరకు టీమ్ఇండియాకు రోహిత్ శర్మ సారథ్యం వహించాలి. మన లక్ష్యం వరల్డ్ కప్ సాధించడమే. ఆ సత్తా రోహిత్‌లో ఉంది. రెండేళ్ల తర్వాత ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. కానీ టీమ్ఇండియాకు వరల్డ్‌కప్‌ను సాధించి పెట్టే సామర్థ్యం ఎవరిలో ఉందో చూడాలి' అని అంబటి రాయుడు ఓ పాడ్‌కాస్ట్‌లో అన్నాడు. 'ఒక వేళ రోహిత్ శర్మ కెప్టెన్‌గా ఉంటే.. వరల్డ్ కప్‌ను మనం గెలిచే అవకాశం ఎక్కువగా ఉంది. అతడు అప్పటి వరకు తన ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాల్సి ఉంటుంది. వన్డేల్లో రోహిత్ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. అందుకే అప్పటి వరకూ అతడు కచ్చితంగా ఆడాలి' అని అంబటి రాయుడు విశ్లేషించాడు.**



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని ఇటీవల టీమ్ఇండియా.. రోహిత్ శర్మ సారథ్యంలోనే గెలిచింది. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లోనూ రోహిత్ (76 పరుగులు) మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేశాడు. ఇప్పటి వరకు 273 వన్డేలు ఆడిన అతడు 11168 పరుగులు చేశాడు. ఇందులో 32 సెంచరీలు, 58 హాఫ్ సెంచరీలున్నాయి. 264.. ఈ ఫార్మాట్లో రోహిత్ శర్మకు వ్యక్తిగత అత్యధిక స్కోర్. 67 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన రోహిత్ శర్మ 4301 పరుగులు చేశాడు. ఇందులో 12 సెంచరీలు, 18 హాఫ్ సెంచరీలున్నాయి. 212 వ్యక్తిగత అత్యధిక స్కోర్. 159 టీ20 మ్యాచ్‌లు ఆడిన రోహిత్ 3003 పరుగులు చేశాడు. ఇందులో 5 శతకాలు, 32 అర్ధశతకాలున్నాయి. 121* వ్యక్తిగత అత్యధిక స్కోర్.